ప్రజాశక్తి

ఆదివారం 22 జనవరి 2023 8 పేజీలు

గుంటూరు పల్నాడు

పది నెలల బాలుడి కిడ్నాప్

- నరసరావుపేటలో కలకలం
- శోకసంద్రంలో కుటుంబం

మిల్లర్ల దయ.. రైతుల ప్రాప్తం..

- సాధారణ రకం ధాన్యానికి దక్కని మద్దతు
- గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కొనుగోలు తీరిది

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు విధానంలో గతేడాది ఎదురైన చేదు అనుభవాలే ఈ ఏడాదీ ఎదురవుతున్నాయి. అధికారులు చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయిలో పరిస్థితులకు పొంతన ఉండడం లేదు. బహిరంగ మార్కెట్‌లోనే అధిక ధర వస్తుందని రైతు భరోసా కేంద్రాల సిబ్బంది ధాన్యం కొనుగోలుకు రైతులను ప్రోత్సహించడం లేదు. ప్రధానంగా సాధారణ రకం ధాన్యం విక్రయాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

మద్దతు ధర ప్రకారం 75 కిలోల బస్తా రూ.1530కు కొనుగోలు చేయాల్సి ఉండగా రూ.1250 నుంచి రూ.1350 వరకు కొనుగోలు చేస్తున్నారు. అయితే 'ఎ' గ్రేడ్‌కు మాత్రం 75 కిలోల బస్తా రూ.1545 ఇవ్వాల్సి ఉండగా రూ.1600 వరకు ఇస్తున్నారు. దీంతో 'ఎ' గ్రేడ్ ధాన్యాన్ని దళారులకే రైతులు విక్రయించుకుంటున్నారు. అయితే సాధారణ రకం ధాన్యం ఉన్న రైతులు మాత్రం నష్టపోతున్నారు.

పల్నాడు జిల్లాలో 1.31 ఎకరాల్లో వరి సాగు చేశారు. 2.96 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. 347 రైతు భరోసా కేంద్రాల ద్వారా 61 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటి వరకు కేవలం 20 కేంద్రాల నుంచి 700 టన్నులు సేకరించారు. అత్యధిక విస్తీర్ణంలో సన్న రకాలు సాగు చేసిన రైతులకు మాత్రం మద్దతు ధరకు అనుగుణంగా ధర వస్తుందని చెబుతున్నారు. కానీ సాధారణ రకం సాగు చేసిన వారికే నష్టం వస్తుంది.

▶ 2లో

గుంటూరులో లెనిన్ చిత్రపటం వద్ద నివాళి అనంతరం మాట్లాడుతున్న పాశం రామారావు

లెనిన్ ఆశయాలు ముందుకు తీసుకెళ్లాలి

వర్ధంతి సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజాశక్తి-గుంటూరు

మార్క్సిస్టు సిద్ధాంతాన్ని ఆచరణలో నిరూపించిన మార్క్సిస్టు మహోపాధ్యాయుడు లెనిన్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. శనివారం బ్రాడిపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో లెనిన్ 99వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రామారావు మాట్లాడుతూ కారల్‌మార్క్స్ రూపొందించిన మార్క్సిజం సిద్ధాంతాన్ని ఆచరణలో లెనిన్ నిరూపించాడని, సోవియట్ యూనియన్‌లో 1917లో కార్మిక వర్గ తిరుగుబాటు ద్వారా, సోషలిస్టు సమాజాన్ని నిర్మించాడని చెప్పారు. సోవియట్, తదితర సోషలిస్టు దేశాల ప్రభావంతో చైనా, క్యూబా, వియత్నాం వంటి దేశాల్లో సోషలిజం సాధించుకున్నారన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

▶ 2లో

ప్రాణాలు కాపాడే మా జీవితాలకే భద్రత కరువు

నరసరావుపేటలో దీక్షల్లో కూర్చున్న 108 ఉద్యోగులు

- 108 ఉద్యోగుల ఆవేదన
- సమస్యల పరిష్కారం కోసం రిలేదీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు, నరసరావుపేట

ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రుని కాపాడేందుకు వాయు వేగంతో వెళ్లి ప్రాణాలు కాపాడే తమ జీవితాలే ప్రమాదంలో ఉన్నాయని 108 ఉద్యోగులు వాపోయారు. తమను కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని, జీతాల చెల్లింపులో జాప్యాన్ని నివారించాలని 108 ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు 108 అంబులెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గుంటూరు, పల్నాడు జిల్లా కలెక్టరేట్ వద్ద శనివారం రిలే దీక్షలు చేపట్టారు. గుంటూరులో దీక్షల్లో కూర్చుకున్న ఉద్యోగులకు యూనియన్ గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణ రావు పూలమాలలు వేసి దీక్షలను ప్రారంభించారు. జిల్లా అధ్యక్షులు షేక్.హసన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లక్ష్మణరావు మాట్లాడుతూ సిఎం ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించటానికి 108 సర్వీసుల్లో పనిచేస్తున్న ఇఎంటి, పైలెట్‌లను వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఇఎంటిలకు రూ.30 వేలు, పైలెట్‌లకు రూ.28 వేలు జీతం ప్రతినెలా 5వ తేదీలోగా చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా

▶ 2లో

మద్దతు ధర చట్టం కోసం 26న ట్రాక్టర్ల ర్యాలీ

8

26 నుండి ఫ్లెక్సీ బ్యానర్ల నిషేధం

2 లో

గుంటూరు మేయర్, కమిషనర్

నీళ్లడిగిన కూలీపై దాడి దుర్మార్గం

పెత్తందారుల్ని వెంటనే అరెస్టు చేయాలి

బాధిత దళిత కూలీకి కెవిపిఎస్ పరామర్శ

ప్రజాశక్తి - అచ్చంపేట

తాగునీరు అడిగిన దళిత కూలీపై దాడి చేసిన పెత్తందారుణ్ణి వెంటనే అరెస్టు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు డిమాండ్ చేశారు. మండలంలోని పెద్దపాలేనికి చెందిన బాధితుడు గంటెల శివప్రసాద్‌ను శనివారం పరామర్శించారు. ఆయన కుటుంబీకులతోనూ మాట్లాడి ధైర్యం చెప్పారు. అనంతరం రవిబాబు మాట్లాడుతూ శివప్రసాద్ మరికొంత మంది ఈనెల

▶ 2లో

పిడుగురాళ్లలో నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

లెనిన్ ఆశయాలు ముందుకు తీసుకెళ్లాలి

(మొదటి పేజీ తరువాయి)

ఈమని అప్పారావు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి మతోన్మాదాన్ని రెచ్చగొడుతోందని, ప్రజల మధ్య ఐక్యత విచ్ఛిన్నం చేస్తోందని చెప్పారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మార్క్సిస్టు సిద్ధాంతం అత్యున్నత మైనదని, దీన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, జిల్లా నాయకులు బి.కోటేశ్వరి, జె.బాలరాజు, వై.కృష్ణకాంత్, ఎస్.కె. అబ్దుల్ సలీమ్ పాల్గొన్నారు.

పిడుగురాళ్ల :పట్టణంలోని కన్నెగంటి భవన్‌లో లెనిన్ చిత్రపటానికి సిపిఎం మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు పూలమాలలేసి నివాళులర్పించారు. కె.సాయికుమార్, సాంబ శివరావు, బి.వెంకటేశ్వర్లు, గోపయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మిల్లర్ల దయ.. రైతుల ప్రాప్తం..

(మొదటి పేజీ తరువాయి)

గుంటూరు జిల్లాలో కేవలం 37 వేల టన్నుల సేకరణ లక్ష్యం నిర్ణయించగా ఇప్పటి వరకు 9 టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. గుంటూరు జిల్లాలో 1.67 లక్షల వరి సాగు జరిగింది. 4 లక్షల టన్నుల దిగుబడి ఉత్పత్తి వస్తుందని అంచనా వేశారు. సాధారణ రకం విషయంలో మాత్రం మిల్లర్లు తాము ఇంత ధర ఇవ్వగలం. మీకు ప్రభుత్వం నుంచి సొమ్ము వచ్చిన తరువాత మిగిలిన తేడా సొమ్ము ఇవ్వాలని ఆంక్షలు పెడుతున్నారని తెలిసింది. దీంతో చాలా మంది రైతులు పొలాల్లోనే ధాన్యం అమ్మేస్తున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి, ప్రభుత్వం ఆంక్షలు, రవాణా ఛార్జీలు, నిల్వ చేసుకునే అవకాశం లేని వారు పొలాల్లోనే విక్రయిస్తున్నారు. క్యాష్ అండ్ క్యారీ విధానంలో రైతులు కూడా బస్తాకు రూ.100 తక్కువగా ఉన్నా పొలాల్లోనే అమ్ముకుంటున్నారు. మార్కెట్‌లో బియ్యం ధరలు కూడా భారీగా పెరగడంతో మిల్లర్లు, దళారీలు నేరుగా పొలాలకు వెళ్లి ధాన్యం కొనుగోలు చేయడం వల్ల ప్రభుత్వ పాత్ర నామమాత్రంగా మారింది. మిల్లర్లు తేమశాతం నిబంధనతో ఆంక్షలు పెట్టడం వల్ల రైతులు ధాన్యం ఆరబెట్టుకునేందుకు తంటాలు పడాల్సి వస్తోంది. రైతులు మిల్లర్లు, వ్యాపారులకు పొలాల్లోనే విక్రయించుకుంటున్నారు. చివరి గింజ వరకు కొంటామని చెబుతున్నా తడిసిన రంగు మారిన ధాన్యం కొనుగోలుకు మిల్లర్లు ముందుకు రాకపోవడంతో రైతులు అయిన కాడికి అమ్ముకుంటున్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న క్లబ్ సభ్యులు

రేపటి నుంచి క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి- కొల్లిపర విద్యార్థులు మనోవికాసాన్ని పెంపొందించుకునేందుకు విద్యతో పాటు ఆటపాటల్లో కూడా పాల్గొనాలని అవుతురామిరెడ్డి మెమోరియల్ స్పోర్ట్స్ క్లబ్ సెక్రటరీ బొమ్మరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. శనివారం అవుతురామిరెడ్డి జూనియర్ కాలేజీలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవుతురామిరెడ్డి మెమోరియల్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీ నుండి 27వ తేదీ వరకు అండర్ -15 బాలురకు క్రికెట్ పోటీలు, బాలికలకు కోకో పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పోటీలు తెనాలి డివిజన్లోని ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనవలసిన వారు అవుతురామిరెడ్డి జూనియర్ కళాశాల కొలిపర్ల సంప్రదించాలని ఆయన తెలిపారు. అనంతరం పోటీలకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ అవుతు కృష్ణారెడ్డి, అవుతూ రామిరెడ్డి ప్రిన్సిపల్ వింత మోహన్ రెడ్డి,వివేక విద్యాసంస్థల డైరెక్టర్ వీరనారాయణ పాల్గొన్నారు

26 నుండి ఫ్లెక్సీ బ్యానర్ల నిషేధం

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 26వ తేదీ నుండి గుంటూరు నగరంలో ఫ్లెక్సీ బ్యానర్ల నిషేధం పక్కాగా అమలు చేయనున్నామని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు, కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మేయర్, కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం సిటీ ప్లానర్, డిప్యూటీ సిటి ప్లానర్లు నగరపాలక సంస్థ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ప్రింటింగ్ ప్రెస్ యజమానులు, హోర్డింగ్స్ ఏజన్సీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్, కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ఫ్లెక్సీ బ్యానర్ల వినియోగంపై ఈ నెల 26 నుండి నిషేదం విధించిందన్నారు. నగరంలో కూడా ప్రభుత్వ ఆదేశాల మేరకు నిషేధం అమలుకు పక్కా కార్యాచరణ సిద్దం చేశామన్నారు. ప్రతి ప్రింటింగ్ ప్రెస్ యజమాని, హోర్డింగ్స్ యజమానులు ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవహరించాల్సిందేనని స్పష్టం చేశారు. ఫ్లెక్సీల స్థానంలో ప్రత్యామ్నాయంగా క్లాత్ బ్యానర్లను వినియోగించవచ్చన్నారు. నిబంధనలు మీరి నిషేధం

సమావేశంలో మాట్లాడుతున్న మేయర్

ఉల్లంఘన చేస్తే ప్రతి చదరపు అడుగు బ్యానర్‌కు రూ.100 అపరాధ రుసుం విధించడం జరుగుతుందన్నారు. నిషేధం అమలుపై నగరంలో శానిటరీ సూపవైజర్ ఆధ్వర్యంలో 4 టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామని, పట్టణ ప్రణాళిక విభాగ అధికారుల ద్వారా రాజకీయ పార్టీల కార్యాలయాలకు, ప్రజా ప్రతినిధులకు కూడా తగిన సమాచారం, ప్రభుత్వ ఉత్తర్వులు అందిస్తామన్నారు. నగరంలో వ్యాపార కాంప్లెక్స్‌ల్లోని సంస్థలకు కూడా రెవెన్యూ విభాగం ద్వారా నోటీసులు ఇస్తామని తెలిపారు. ప్రజలు, వ్యాపార సంస్థలు సహకరించాలని కోరారు.

ముగిసిన ఏపిఈఆర్‌సి అభిప్రాయ సేకరణ

వివరాలు వెల్లడించిన విద్యుత్ ఈఈ చిరంజీవి

ప్రజాశక్తి-తెనాలి

విద్యుత్ రెగ్యులేటరీ కమిటీ ప్రజాభిప్రాయ సేకరణ శనివారంతో ముగిసింది. ఏపిఈఆర్‌సి చైర్మన్ నాగార్జునరెడ్డి నేతృత్వంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ చార్జీలను నిర్దేశించేందుకు ఈనెల 19 నుంచి 21 వరకూ విశాఖపట్టణం నుంచి వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. స్థానిక చెంచుపేట విద్యుత్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వివి చిరంజీవి వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. మూడు రోజుల పాటు జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో దాదాపు 75 మంది అభ్యంతరాలు వ్యక్తం చేశారన్నారు. వారిలో ముఖ్యంగా గృహ వినియోగదారులు, ఇండస్ట్రియల్ వినియోగదారులు, వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు, రైతు సంఘం ప్రతినిధులు, టిడిపి నాయకులు , లోక్ సత్తా ఉద్యమ సంస్థ ప్రతినిధులు ఉన్నారన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మీటర్లు ఏర్పాటును వ్యతిరేకించారని, అధిక ధరలకు విద్యుత్‌ను కొనుగోలు చేసి ఆ భారాన్ని ప్రజలపై వేస్తున్నారని, ట్రూఅప్ చార్జీలు కూడా వినియోగదారులకు భారంగా మారాయని, ఎస్సీ, ఎస్టీ వినియోగదారులందరికీ సబ్సిడీ వర్తింప చేయాలన్న అభిప్రాయాలను వ్యక్తం చేసినట్లు చెప్పారు. ఆదాయం, వ్యయానికి మధ్య రూ.13వేల కోట్ల వ్యత్యాసం ఉందన్నారు. డిస్కంల చైర్మన్లు, ఎండీలు కూడా వీడియో కాన్ఫిరెన్స్‌లో మాట్లాడారన్నారు. ప్రజల అభ్యంతరాలను, అబిప్రాయాలను ఏపిఈఆర్‌సి చైర్మన్ పరిగణనలోకి తీసుకుని, నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు.

ప్రాణాలు కాపాడే మా జీవితాలకే భద్రత కరువు

(మొదటి పేజీ తరువాయి)

భావించే 108 అంబులెన్స్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సిఎం చొరవ చూపాలన్నారు. ఉద్యోగులను చర్చలకు పిలిచి, ప్రజల ప్రాణాలు కాపాడే 108 ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా అధ్యక్షులు షేక్.హసన్ మాట్లాడుతూ ఇఎంటి, పైలెట్‌లకు ప్రతినెలా జీతాల చెల్లింపులో జాప్యమవుతోందన్నారు. సిఎం హామీ మేరకు ప్రభుత్వ నియమకాల్లో అర్హత కలిగిన ఇఎంటి, పైలెట్‌లకు వెయిటేజి ఇవ్వాలని, అరబిందో ఎమర్జెన్సీ సర్వీసెస్ సంస్థ వచ్చిన తర్వాత అక్రమంగా వివిధ కారణాలతో విధుల నుండి తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఎఇఎంఎస్ సంస్థలో వాహన ప్రమాదం జరిగిన వెంటనే విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులను విధుల నుండి తొలగించటం, ఎఫ్ఐఆర్ ఉంటే విధుల నుండి నిలుపుదల చేయటం వంటి చర్యలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఇఎస్ఐ నిమిత్తం చెల్లించాల్సిన యజమాని వాటా కూడా ఉద్యోగి జీతం నుండి మినహాయించటం అన్యాయమని, ఉద్యోగి వాటాను మాత్రమే ఉద్యోగి జీతం నుండి మినహాయించాలని కోరారు. వాహనాలు సరైన కండిషన్‌లో ఉంచాలని, ప్రతి వాహనానికి మెడికల్ ఇండెంట్‌ను ప్రతినెలా సమకూర్చాలని అన్నారు. ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించకుంటే ఏక్షణంలోనైనా విధులు బహిష్కరిస్తామని, దాని వల్ల కలిగే అసౌకర్యానికి యాజమాన్యమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆర్.రామకృష్ణ, బి.అశోక్, కె.పిచ్చయ్య, ఎల్.సిద్ధార్థ, కె.నాగేశ్వరరావు, ఎం.రాజేష్ పాల్గొన్నారు.

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని ధర్నా చౌక్ వద్ద రిలేదీక్షలు చేపట్టారు. సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు ఇ.మస్తాన్‌రెడ్డి, సిలార్ మసూద్ మాట్లాడుతూ జీతాల చెల్లింపులో 108 నిర్వహణ సంస్థ జాప్యం చేస్తోందని, సిబ్బందిని ఎప్పుడు తొలగిస్తారో తెలియడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. పలు సమస్యలపై సంస్థ ప్రతినిధులతో చర్చించిన సందర్భంలో రాతపూర్వకంగా విచ్చిన హామీలను సంస్థ విస్మరిస్తోందని విమర్శించారు. పైగా ఉద్యోగులను అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీస్ సంస్థ వేధిస్తోందని, తొలగింపులకూ పాల్పడుతోందని మండిపడ్డారు. ఏడాదికి 20 శాతం వేతనాల పెంపు అమలు చేయాలని, 2 నెలల పెండింగ్ జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 8 గంటల పని విధానం అమలుతోపాటు ఇతర సమస్యలనూ పరిష్కరించాలన్నారు. దీక్షలకు సిఐటియు రాష్ట్ర నాయకులు జి.విజయ్‌కుమార్ మద్దతు తెలిపారు. తొలిరోజు దీక్షలను వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.లక్ష్మీశ్వరరెడ్డి నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. పి.లక్ష్మీనారాయణ, కె.రాము, ఎం.నారాయణ, ఎన్.బాజీరెడ్డి, ఎం.వెంకటేశ్వర్లు, గౌస్, 40 మందికిపైగా ఉద్యోగులు పాల్గొన్నారు.

నీళ్లడిగిన కూలీపై దాడి దుర్మార్గం

(మొదటి పేజీ తరువాయి)

13న గ్రామానికే చెందిన ఉప్పలపాటి శ్రీను పొలానికి మిర్చి కోత కోసం వెళ్లారని, ఎండ తీవ్రత నేపథ్యంలో దాహమై తాగునీటిని పొలం యజమాని శ్రీనును అడిగారని, దీంతో ఆయన శిలుము పట్టిన బోరు నీరు ఇచ్చాడని చెప్పారు. అయితే ఆ నీరు వాసన వస్తుండడంతో తాగలేక ప్లాంట్ నీరు తేవాలని కోరారని, అయినా మళ్లీ అదే నీరు ఇవ్వడంతో శివప్రసాద్ ప్రశ్నించాడని తెలిపారు. దీన్ని సహించలేని యజమాని 'కూలికి వచ్చినవాళ్లు మేము ఇచ్చిన నీళ్లు తాగితే తాగండి లేపోతే అందరూ చేలో నుంచి వెళ్లిపోండి..' అని దురుసుగా మాట్లాడారని, నీళ్లడగడం కూడా తప్పేనా? అని శివప్రసాద్ అనడంతో 'నువ్వు మమ్మల్ని అడిగేంత

పరామర్శిస్తున్న జి.రవిబాబు

మాత్రపోడివా' అంటూ యజమాని ఉప్పలపాటి శ్రీను, అతని కుమారులు వెంకటేష్, గోపీ కలిసి శివప్రసాద్ మీద దాడికి దిగారని, గాయపడిన శివప్రసాద్‌ను తోటి కూలీలు సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రి తీసుకెళ్లారని వివరించారు. పొలం వద్ద తాగునీరు ఏర్పాటు చేయాల్సిన యజమాని ఏర్పాటు చేయకపోగా దూషణ, దాడికి దిగడం, కులం పేరుతో దూషించడం దుర్మార్గమని అన్నారు. బాధితు ఫిర్యాదు మేరకు నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినా ఇంకా అరెస్టు చేయలేదని, వారిని అరెస్టు చేయకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

బాలికలకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని ఉర్దూ హైస్కూల్ ప్రాంగణంలో జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా 'ఆడపిల్లలను రక్షించండి' అనే అంశంపై జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రతి విభాగంలో నగదు బహుమతలు, ప్రశంసాపత్రాలను బాలికా దినోత్సం రోజున జిల్లా కలెక్టర్ చేతులమీదుగా అందిస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జె.హనుమంతరావు తెలిపారు.

కేక్ కట్ చేస్తున ఆంజనేయులు

ఘనంగా వైవి ఆంజనేయులు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రముఖ విద్యావేత్త, చలపతి విద్యా సంస్థల అధినేత వై.వి.ఆంజనేయులు 65వ జన్మదిన వేడుకలు శనివారం లాంలోని చలపతి ఫార్మసీ కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఛైర్మన్ జన్మదిన వేడుకల్ని పురస్కరించుకొని ఫార్మసీ కాలేజిలో 2021-22 విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతి, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆక్విటీ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్ బి.సుబ్రహ్మణ్య శర్మ, చైతన్య విద్యా సంస్థల ఏజిఎం దుర్గాప్రసాద్, చలపతి విద్యాసంస్థల సెక్రెటరీ వై.సుజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ప్రిన్సిపల్ రామారావు ఫార్మసీ కాలేజి స్థాపన, ప్రగతి గురించి వివరించారు. అనంతరం అతిథులు, అధ్యాపకులు, విద్యార్థుల సమక్షంలో వైవి ఆంజనేయులు కేక్ కట్ చేసి, జన్మదిన వేడుకలు జరుపుకున్నారు.

కేక్ కట్ చేస్తున్న గ్రంధి కాంతారావు

ఘనంగా గ్రంధి కాంతారావు పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

క్రేన్ వక్కపలుకులు సంస్థ అధినేత గ్రంధి కాంతారావు జన్మదిన వేడుకలు స్థానిక సంపత్ నగర్‌లోని క్రేన్ వక్కపొడి ఆఫీసులో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంతారావుకు ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, డిప్యూటీ మేయర్ సజిలా, నగర ప్రముఖులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ప్రజాశక్తి జిల్లా ఇన్‌చార్జి చుక్కా.శంకరరావు, సిటీ ఇన్‌ఛార్జి కానాల సుధీర్, పలువురు పార్టీల నాయకులు, కుటుంబ సభ్యుల సమక్షంలో కాంతారావు కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు.

వర్సిటీ పరిశోధకుడు కుశరాజుకు జాతీయ ఫెలోషిప్

ప్రజాశక్తి-ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎకనామిక్స్ పరిశోధకుడు బేతా కుశరాజు యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యుజిసి) నేషనల్ ఫెలోషిప్ ఫర్ బ్యాక్వర్డ్ క్లాసెస్ జాతీయ ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వర్సిటీ ఉపకులపతి ఆచార్య పట్టేటి రాజశేఖర్, రెక్టర్ ఆచార్య పి.వరప్రసాద్ మూర్తి, వర్సిటీ కళాశాల అభివృద్ధి మండలి డీన్, ఎకనామిక్స్ విభాగధిపతి ఆచార్య కడిమి మధుబాబులు పరిశోధకుడు కుశరాజును అభినందించారు. గత అక్టోబర్‌లో జరిగిన యూజీసీ నెట్ పరీక్షకు కుశరాజు హాజరయ్యారు. ఐదుఏళ్ల పాటు ఫెలోషిప్‌ను పొందనున్నారు. డైరెక్ట్ బెనిఫిట్ స్కీమ్ పేదరికంలో ఉన్న కుటుంబాలపై ప్రభావం అనే అంశంపై ఎకనామిక్స్ విభాగధిపతి ఆచార్య కడిమి మధుబాబు పర్యవేక్షణలో కుశరాజు పరిశోధన చేస్తున్నారు. కార్యక్రమంలో ఎకనామిక్స్ విభాగ అధ్యాపకులు డాక్టర్ కర్రీ కిషోర్ బాబు, డాక్టర్ కే.మహేంద్ర కుమార్, డాక్టర్ ఏ బాలకష్ణ, డాక్టర్ నంబూరు బాబు, డాక్టర్ పందిటి శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు సర్టిఫికెట్లతో హైకోర్టు బార్ కౌన్సిల్ సభ్యత్వం కేసు

నిందితులను త్వరలో పట్టుకుంటాం : డీఎస్పీ

ప్రజాశక్తి - తుళ్లూరు

తప్పుడు సర్టిఫికెట్ లతో హైకోర్టు బార్ కౌన్సిల్ లో సభ్యత్వం పొందిన కేసులో నిందితులను త్వరలో పట్టుకుంటామని తుళ్లూరు డిఎస్పి పోతురాజు తెలిపారు. శనివారం మండలంలోని మందడంలోని పోలీస్ స్టేషన్ లో డిఎస్ పి కేసు వివరాలను వెల్లడించారు.నకిలీ సర్టిఫికెట్ ల ఉదంతంపై హైకోర్టు బార్ కౌన్సిల్ కార్యదర్శి పద్మావతి ఫిర్యాదు మేరకు ఈ నెల 11న కేసు నమోదు చేసామని ఆయన చెప్పారు.అయిదుగురు వ్యక్తులపై రెండు వేరు వేరు నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసామని వెల్లడించారు. ఐపిసి 420, 120బి,467,468, 471,రెడ్ విత్34, అడ్వకేట్ సెక్షన్ 45 కింద కేసు నమోదు చేశామని చెప్పారు.ఈ విషయంపై బార్ కౌన్సిల్ సభ్యులను విచారించామన్నారు. తెనాలి,సత్తెనపల్లి,తుని,కాకినాడకు చెందిన వ్యక్తులు నకిలీ లా సర్టిఫికెట్లతో బార్ కౌన్సిల్ సభ్యత్వం పొందే ప్రయత్నం చేశారని అన్నారు. 2011,2014 వ సంవత్సరాల నుండి కొందరు ప్రాక్టీసులో ఉన్నారని, నకిలీ లా పట్టాలు పొందిన వారిలో కొందరు ప్రస్తుతం ప్రాక్టీసులో లేరని చెప్పారు. ఆంధ్రా యూనివర్సిటీ,అస్సాం లోని విప్రుఘడ్,బీహార్ లోని బౌద్ధయా యూనివర్సిటీ, యూపీ ఇనామలై యూనివర్సిటీ ల నుండి నకిలీ లా పట్టాలు పొందారని చెప్పారు. ఈ కేసులో కొంతమంది బార్ కౌన్సిల్ నుండి స్వచ్ఛందంగా తప్పున్నారని,తప్పుకున్న వారిపై కూడా ప్రభుత్వ న్యాయవాది సలహా మేరకు చర్యలు తీసుకుంటామన్నారు ఈ వ్యవహారంలోని నిందితులను త్వరలో అరెస్ట్ చేస్తామని చెప్పారు.

18 వేల మంది కూలీలకు పనులు
పిడి జోసఫ్ కుమార్

ప్రజాశక్తి -వినుకొండ

నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో శనివారం 18 వేలమంది ఉపాధి హామీ కూలీ లకు పని కల్పించే లక్ష్యంగా ఎం ఎన్ఆర్ ఈజీఎస్ అధికారులు సిబ్బంది పనిచేయాలని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ జోసఫ్ కుమార్ ఆదేశించారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉపాధి హామీ పథకంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ వ్యవసాయ పనుల సీజన్ కావడంతో కూలీలు ప్రతిరోజు మిరప, పొగాకు తదితర పంట కోతలకు వెళు తున్నారని ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు కూలీలకు ప్రతిరోజు పనులు కల్పించి రోజుకు ప్రత్యేక కూలికి 257 రూపాయలు కూలి వేతనం వచ్చే విధంగా పనిచేయించాలన్నారు. ప్రతి మండలం ఏపీవో, టిఏలు ఎఫ్ఏ లు సిబ్బంది టార్గెట్ ప్రకారం కూలీలతో పనులు చేయించాలని ఆదేశించారు. కూలీలు ఇబ్బంది పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆర్థిక సంవత్సరం ముగింపు మార్చినాటికి లక్ష్యం దిశగా పనులు పూర్తి చేయాలని, వేతనాలు చెల్లింపుల్లో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

ఇబ్రహీం హత్య కేసులో మిగిలిన నిందితులను అరెస్టు చేయండి

నరసరావుపేట పోలీస్‌స్టేషనులో టిడిపి ఫిర్యాదు

నిందితుల అరెస్టు గురించి పోలీసులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-నరసరావుపేట

ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కనుసన్నల్లోనే షేక్ ఇబ్రహీం హత్య జరిగిందని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆరో పించారు. ఇబ్రహీం హత్యలో మరికొం దరు నిందితులను అరెస్ట్ చేయలేదని, ప్రభుత్వం నుంచి ప్రకటించిన పరిహారం రూ 25 లక్షలు నష్ట పరిహారం కుటుం బానికి అందలేదని నరసరావుపేట 1వ పట్టణ పోలీస్‌స్టేషనులో శనివారం ఫిర్యాదు చేశారు. వైసిపి ఎమ్మెల్యే కిరాయి గూం డాలను పెట్టి ఇబ్రహీంని చంపిం చారని ఆరోపించారు. టిడిపి పోరాటంతో హంత కుల్లో ఇద్దరిని అరెస్ట్ చేసిన పోలీసులు, మరో ఇద్దరు నిందితులను ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. హత్య చేసిన వారు,చేయించిన వారిని అరెస్టు చేయాలని ఎన్నో మార్లు డిఎస్పీ, ఎస్పీలను కోరా మన్నారు. ముస్లిం మైనారిటీని అత్యంత దారుణంగా చంపేస్తే న్యాయం చేయాల్సిన పోలీసులు మీన మేషాలు లెక్క పెడుతున్నా రని చదలవాడ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇబ్రహీం కుటుం బానికి న్యాయం చేయకపోతే మైనారి టీలతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తా మని హెచ్చరిం చారు. రాష్ట్ర మైనార్టీ అధ్యక్షుడు మౌలానా ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ మసీదు స్థలం అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వం నిధులు కేటాయిస్తే ఆ నిధులతో పనులు చేయ కుండా వైసీపీ నేతలు ప్రైవేటు వాళ్లకి అప్ప గించడాన్ని ఎదిరించినందుకే ఇబ్రహీంని హత్య చేశారని ఆరోపించారు.

రూ.2 లక్షలు సాయం

ఇబ్రహీం కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చిన అరవిందబాబు శనివారం రూ.2 లక్షలు సాయం ప్రక టించగా రాష్ట్ర మైనార్టీ అధ్యక్షుడు మౌలానా ముస్తాక్ అహ్మద్ రూ 1 లక్ష ప్రకటించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వర రావు, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షుడు పూదోట సునీల్,పల్నాడు జిల్లా మైనార్టీ అధ్యక్షుడు అమిర్ అలీ,గొట్టిపాటి జనార్దన్ బాబు, షామిమ్ ఖాన్,సౌదగర్ జానీ, ఆన్సర్,రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి జరీనా,జిల్లా కమిటీ కార్యదర్శి ముంతాజ్ బేగం,షేక్ గని,హనీఫ్,రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ,పట్టణ మైనార్టీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - తాడేపల్లి

తాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పెనుమాక గ్రామంలో ఈనెల 16 వ తేదీన రామాలయం, బ్రహ్మంగారి గుడులలో గుర్తు తెలియని దొంగలు, తాళాలు పగలగొట్టి హుండీలో సొమ్మును దొంగిలించిన విషయం తెలిసిందే.ఈ దొంగతనాలకు పాల్పడిన పశ్చిమగోదావరి జిల్లా భీమ వరానికి కు చెందిన ఇద్దరు బాల నేరస్తులను అదుపులోనికి తీసుకున్నారు. ఈ నేరాలు చేయుటకు ఉపయోగించిన రెండు మోటార్ సైకిళ్ళ ను తాడేపల్లి పోలీస్ వారు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా, తాడేపల్లి మండలంలో వివిధ గ్రామాలలో వ్యవసాయ మోటార్లు, గవర్నమెంట్ వారు నిర్మించిన ఎలక్ట్రిక్ టవర్లకు ఉపయోగించిన ఇనుప బద్దలు, జాయింట్లను దొంగిలించే నేరాలకు పాల్పడుతున్న మంగళగిరి గండాలయ్య పేటకు చెందిన తుమ్మా సుబ్రహ్మణ్యం,ఇంకొక బాల నేరస్తుడిని అదుపులోనికి తీసుకొని వారి వద్ద నుండి మూడు వ్యవసాయ మోటార్లు, రూ. 60,000 నగదును తాడేపల్లి పోలీసు వారు స్వాధీన పరుచుకున్నారు. నేరస్తులను రిమాండ్ నిమిత్తంమంగళగిరి కోర్టులో హాజరు పరిచారు.

ప్రజల సౌకర్యార్థం ఇంటికే రేషన్

ప్రజాశక్తి-నరసరావుపేట

ప్రజల సౌకర్యం దృష్టిలో పెట్టుకుని రేషన్ సరుకులను ప్రభుత్వం వాహనాల ద్వారా నేరుగా ఇంటికి తీసుకువచ్చి అందజేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. రేషన్ సరుకుల సరఫరాకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాహనాలు ప్రారంభించి రెండేళ్లు గడిచిన సం దర్భంగా స్థానిక వైసిపి కార్యాలయంలో సిబ్బంది ఏర్పాటు చేసిన కేకు కట్ చేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎక్కడ అవినీతి,లంచాలు కుతావు లేకుండా నేరుగా ప్రజల వద్దకే రేషన్ పంపిణీ దేశంలో ఎక్కడా లేదన్నారు. రాష్ట్రంలో వాలంటరీ వ్యవస్థ చాలా గొప్ప మార్పులు తీసుకొని వచ్చిందన్నారు. కరోనా సమయంలో వాలంటీర్లు చేసిన సేవ ను చూసి బ్రిటిష్ హై కమిషన్ మెచ్చుకున్నారని గుర్తు చేశారు. దేశం మొత్తం మీద 29 సార్లు ఫ్రీ ఫీవర్ చేకేప్ చేసిన ఏకైక రాష్ట్రం ఏపి అన్నారు.

చట్టాల పట్ల అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-వినుకొండ

మండల లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్, వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి ఏ.తౌషిద్ హుస్సేన్ ఆదేశాలతో న్యాయవాదులతో కలసి శనివారం వినుకొండలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ బిల్డింగ్ నందు న్యాయ విజ్ఞాన సదస్సు బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఆరే. సామ్రాజ్యం అధ్యక్షతన నిర్వహించారు. చట్టాల పట్ల, సమాజం పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన, బాధ్యత కలిగి ఉండాలని ఆరే. సామ్రాజ్యం తెలిపారు.

చిన్న చిన్న తగాదాలతో పోలీస్ స్టేషన్ల చుట్టూ కోర్టులచుట్టూ తిరిగి తమ విలువైన సమయాన్ని, డబ్బును, వృథా చేసుకోవద్దని, రిటైర్డ్ ఎంప్లాయిస్ తాము తమ సర్వీసులో ఎంతో కష్టపడి సంపాదించుకొన్న సొమ్ముతో స్థిరచరాస్తులు కొనుగోలు చేసే విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, తాము సంపాదించిన ఆస్తులను కుటుంబాలలో గొడవలు రాకుండా ఏ విధంగా అనుభవించు కోవాలనే అంశాలపై అవగాహన తెలిపారు. తల్లిదండ్రులు,వృద్ధుల సంక్షేమ, రక్షణ చట్టం గురించి పలువురు న్యాయవాదులు తెలియజేశారు. ఎంప్లాయిస్ తాము రిటైర్ అయిన తరువాత ఇంటిదగ్గర ఖాళీగా ఉండకుండా అందరూ ఒక యూనిటీగా ఏర్పడి తమకున్న అనుభవాలతో చుట్టుప్రక్కల వారికీ సలహాలనిస్తూ, తరచుగా అన్నదాన కార్యక్రమాలు వంటి సర్వీసులు చేస్తున్నందుకు వారిని న్యాయవాదులు అభినందించారు. చట్టాల ను గౌరవించాలని, ఏమైనా సమస్యలు ఉంటే మండల న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఎలా సత్వర న్యాయం పొందవచ్చుని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ మరియు జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సులో వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి ఏ.తౌషిద్ తదితరులు

హుస్సేనగరంలో 'మాటామంతి'

ప్రజాశక్తి-పెదకూరపాడు

పేదలను వైసీపీ ప్రభుత్వం పట్టించు కోవడంలేదని మహిళ నేతలు అన్నారు. శనివారం పెదకూరపాడు మండలంలోని హుస్సేనగరం లో మాటామంతి కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నిత్యవసర ధరలు ప్రభుత్వం పెంచడం వల్ల పేదల ఆర్థిక పరిస్థితి రోజురోజుకు దిగజారుతుందన్నారు. అయినా ఈ ప్రభుత్వం పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తుందన్నారు. ఇటువంటి ప్రభుత్వాన్ని సాగనంపాలన్నారు. ముంతాజ్,సరిపూడి కష్ణకుమారి,నూతక్కి ఈశ్వరి,కొండ్రు పద్మలత, కావూరి సుజాత,యలమంచిలి అరుణ పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై అవగాహన

ప్రజాశక్తి-పెదనందిపాడు : బాలికలపై లైంగిక వేధింపులను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అప్పాపురం సచివాలయ మహిళా పోలీస్ కె.దుర్గ తెలిపారు. శనివారం అప్పాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బాల,బాలికలకు, తల్లిదండ్రులకు లైంగిక వేధింపులపై అవగాహన మరియు చైతన్య కార్యక్రమాన్ని ప్రధానో పాధ్యాయులు గేరా మోహనరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా పోలీస్ దుర్గ గుడ్ టచ్ - బ్యాడ్ టచ్ గురించి వివరించారు.

CHANGE OF NAME

I, **Sri KOMANENI THRINADH, S/o. SURYA PRAKASA RAO,** Door No: 3-11, Karlapudi Village, Amaravathi Mandal, Palnadu District, Pin: 522016, shall henceforth be known as **KOMATI THRINADH, S/o.SURYA PRAKASA RAO.**

ప్రకటన

మహారాజశ్రీగుంటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

ఒ.యస్.నెం. 1316/2019

బిట్వీన్:
మలిశెట్టి జనార్దనరావు ...వాది
మరియు
మలిశెట్టి దివ్య, W/o రాఘవేంద్రహేమంత్‌కుమార్
నివాసం డోర్.నెం. 20-17-60, బాపూజీ రోడ్,
సంగడిగుంట, గుంటూరు .....ప్రతివాది

ఈ దావాలోని వాది, ప్రతివాదిపై వాది పేరటికి ది.28-02-2016వ తేదిన వ్రాయించి యిచ్చిన విక్రయ ఎగ్రిమెంటు ప్రకారము వాది పేరిటికి దావా షెడ్యూల్ ఆస్థిని రిజిష్టరు చేయమని వాది దాఖలు చేసిన యీ దావాలో ప్రతివాది అయిన మీకు నోటీసు నిమిత్తం ది 31-01-2023 వ తేదికి వాయిదా అయివున్నది. కనక మీకుగల ఆక్షపణలను సదరు తేది ఉదయం 10.30ని॥లకు కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకోవలెను ఇట్లు

T.Muralidhar,
Advocate, Guntur.
Cell: 9849519808

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి:మాచర్ల వారి కోర్టులో

ఇ.పి:33/2017 ఓ.ఎస్:128/2013

బిట్వీన్ :పల్లె వెంకటరెడ్డి ...డిహెచ్ఆర్
మరియు
గాలి రామిరెడ్డి ...జెడిఆర్

పై ఇ.పి నందు ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్థిని పై శ్రీ కోర్టు వారు ది 08-02-2023న ఉదయం 10.30 గంటలకు తమ ఆవరణలో బహిరంగవేలం నిర్వహించెదరు. కావున ఆసక్తి కలిగిన పాటదారులు శ్రీ కోర్టు వారి షరతులకు లోబడి వేలంలో పాల్గొనవలసి వున్నది.

షెడ్యూల్ : నర్సరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, మాచర్ల సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు ఇలాక, దుర్గి మండలం, ధర్మవరం గ్రామంలోని ఎస్.నెం: 65లో య7.02సెంట్లలో య3.02 సెంట్ల భూమికి హద్దులు:-
తూర్పు: రోడ్డు, దక్షిణం: బలపనూరి పిచ్చిరెడ్డి
పడమర:పల్లె పిచ్చిరెడ్డి,
ఉత్తరం:బొగ్గారపు శీతారామయ్య
డిహెచ్ఆర్ విలువ:రూ 3,00,000/-(మూడు లక్షలు)
అమీనా విలువ:రూ 4,00,000/-(నాలుగు లక్షలు)
వేలం తేది: 08.02.2023
ఫరదర్ హియరింగ్:15-02-2023
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

ఇట్లు
కేళం శ్రీనివాసరావు
డిహెచ్ఆర్ తరపు న్యాయవాది
మాచర్ల-522426, పల్నాడు జిల్లా
సెల్‌నెంబరు - **9866678701**

వ్యవసాయ కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు

ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జొన్నా శివశంకరరావు

ప్రజాశక్తి-నరసరావుపేట

వ్యవసాయ రంగం కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా రైతు సంఘం ఆధ్వర్యంలో సమరశీల పోరాటాలకు రైతులను సిద్ధం చేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జొన్నా శివశంకర రావు పిలుపునిచ్చారు. స్థానిక కోటప్పకొండ రోడ్డులోని ప్రజా సంఘాల కార్యాలయంలో రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి బాలకృష్ణ అధ్యక్షత వహించారు. జొన్న శివశంకర రావు మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్‌లో కట్ట పెట్టాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తే రైతాంగం సమరశీలంగా పోరాడి కేంద్రం మెడల వంచి వ్యవసాయ చట్టాలు వెనక్కి తీసుకునేలా పోరాడాలన్నారు. ఇందుకు రైతుల్ని సమాయత్తం చేయాలన్నారు. రాష్ట్రంలో రైతులకు మద్దతు ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి భరోసా కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం, అమలులో చిత్తశుద్ధితో చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. నకిలీ పత్తి విత్తనాలతో, మిరప పంటకు బొబ్బర తెగులుతో రైతాంగం ఇబ్బందుల్లో ఉంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా కూడా లేదని అన్నారు. రాబోయే కాలంలో రైతులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ జనవరి 26వ తేదీన నరసరావుపేటలో జరిగే ట్రాక్టర్ ర్యాలీలో రైతులు, కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం, రైతులకు మద్దతు ధరలు కల్పించాలని కోరుతూ ఏప్రిల్ 5న చలో పార్లమెంటు కార్యక్రమానికి జిల్లా నుండి పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. రైతు సంఘం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య మాట్లాడుతూ నకిలీ విత్తనబాధిత రైతులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల సమస్యలను పరిష్కారం చేస్తానని చెప్పే ప్రభుత్వం, ఆచరణలో డొల్లగా మారిందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కె.రామారావు, టి.సుబ్బయ్య, కె.సాంబయ్య, ఎం.నరసింహారావు, వెంకటేశ్వర్లు, బి.నాగేశ్వరరావు, జి.జాలయ్య, ఆర్.వెంకటేశ్వర్లు, ఎం.పిచ్చిరెడ్డి, బి.నరసింహారెడ్డి, సాంబశివరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శివశంకరరావు

బ్రిడ్జి నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ శివశంకర్

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

నరసరావుపేట నుండి కోటప్పకొండ వెళ్లే మార్గమధ్యం ఎలమంద వద్ద జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ శివశంకర్ శనివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతూ ఫిబ్రవరి 18వ తేదీన జరిగే కోటప్పకొండ తిరునాళ్ల సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రసిద్ధి సైవక్షేత్రమైన కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి దేవాలయం వద్ద నిర్వహించే మహా శివరాత్రి ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారని, భక్తుల రాకపోకలకు ఎటువంటి అసౌకర్యం కలగకూడదన్నారు. వీలైనంత వరకు బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని, లేనిపక్షంలో ప్రత్యామ్నాయంగా భక్తుల రాక పోకలకు రోడ్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇన్‌ఛార్జి ఆర్డిఒ వసంత బాబు, రోడ్లు భవనాల శాఖాధికారి రాజా నాయక్, మండల రెవెన్యూ అధికారి రమణ నాయక్ పాల్గొన్నారు.

సమిష్టి కృషితోనే మాచర్లకు స్కాచ్ అవార్డు

కమిషనర్ ఇవి రమణబాబు

ప్రజాశక్తి - మాచర్ల

'క్లీన్ మాచర్ల-గ్రీన్ మాచర్ల' నినాదంతో పురపాలక శాఖ చేపట్టిన కార్యక్రమానికి ప్రజలు సహకరించడంతోనే రాష్ట్ర, జాతీయ స్థాయిలో స్కాచ్ అవార్డును అందుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఇవి రమణబాబు తెలిపారు. మాచర్ల పురపాలక సంఘానికి ఈ అవార్డు దక్కిన సందర్భంగా శనివారం ఉదయం కమిషనర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో అన్ని పురపాలక సంఘాల నుండి గ్రీనరి, పారిశుధ్యపై ప్రజెంటేషన్స్‌ను స్కాచ్ సంస్థ కోరగా, ఈ పురపాలక సంఘంలో చేపడుతున్న కార్యక్రమాలను వారికి వివరించటం జరిగిందన్నారు. జాతీయ స్థాయిలో స్కాచ్ సంస్థ చేపట్టిన పోటీలలో మాచర్లకు అవార్డు రావటం గర్వకారణమన్నారు. చెత్త సేకరణ, తరలింపు విధానంతో మాచర్ల పట్టణాన్ని గ్రీన్‌గా ఉంచేందుకు చర్యలు, సేకరించిన చెత్తను సద్వినియోగం చేసుకోవటం లాంటి కృషి వల్లే ఈ అవార్డును అందుకునేందుకు కారణమైందని వివరించారు. స్కాచ్ అవార్డు దక్కడం వెనుక సిబ్బంది కృషి, పాలక వర్గ సహకారం, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పిన్నెల్లి వెంకట రామిరెడ్డిల ఆలోచనలు ఉన్నట్లు తెలిపారు. ఈ అవార్డును బాధ్యతగా స్వీకరించి, పట్టణ ప్రజలకు మౌలిక సౌకర్యాలను మరింత మెరుగ్గా అందించేందుకు అంకితభావంతో పని చేస్తామని రమణబాబు తెలిపారు.

మాచర్ల ఎంపిడిఒ గుండెపోటుతో మృతి

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల ఎంపిడిఒ సురేష్ విజయ్‌కుమార్ గుండెపోటుతో శనివారం మృతి చెందారు. ఆయన ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఇటీవల గుంటూరులో చికిత్స తీసుకున్నారు. శనివారం తిరిగి అనారోగ్యానికి గురైన ఆయనను గుంటూరులోని లలితా హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. సురేష్ విజయ్‌కుమార్ మృతిపై జడ్‌పిటిసి మల్లుస్వామి, ఎంఇఒ వేముల నాగయ్య, నాయకులు బూడిద శ్రీనివాసరావు, పి.కృష్ణారెడ్డి, చిన్నా, కోటేశ్వరరావు తదితరులు సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ముగిసిన ఎడ్ల బండ లాగుడు పోటీలు

ఎన్‌టిఆర్ జిల్లా తెంపల్లికి చెందిన ఎడ్ల జతకు ప్రథమస్థానం

ప్రజాశక్తి - దుర్గి

మండల కేంద్రమైన దుర్గిలోని వీరబ్రహ్మేంద్రస్వామి తిరుణాలను పురస్కరించుకుని గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఎడ్ల బండలాగుడు పోటీలు శనివారంతో ముగిశాయి. చివరిరోజున నిర్వహించిన విభాగంలో ఎన్టీ ఆర్ జిల్లా.. గన్నవరం మండలం తెంపల్లికి చెందిన జొన్నలగడ్డ దేవతారావు ఎడ్ల జత సమయానికి 39 31 అడుగులు లాగి మొదటి స్థానంలో నిలిచాయి. అదే విధంగా పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం మతకమళ్ళకు చెందిన ప్రసాద్ ముంద్రు జీవప్రసాద్ ఎడ్ల జత 38 51 అడుగుల దూరం లాగి రెండవ స్థానంలో, గుంటూరు జిల్లా పత్తిపాడుకు చెందిన పమిడి అంజయ్య చౌదరి ఎడ్ల జత 36 39 అడుగులు లాగి మూడవ స్థానంలో నిలిచాయి. ఈ పోటీల్లో మొత్తం 15 ఎడ్ల జతలు పాల్గొనగా, వరుసగా 11 ఎడ్ల జతల యజమానులకు దాతల సహకారంతో వారి చేతుల మీదుగా నగదు బహుమతులు అందజేశారు కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు గందె గోపాల్, కటకం రామారావు చాట్ల రమేష్ తదితరులు పర్యవేక్షించారు. న్యాయ నిర్ణేతలుగా గుడా శీను, నరేష్ పర్య వేక్షించారు.

ఆకట్టుకున్న కళాఖండాలు

ప్రజాశక్తి - వినుకొండ

వినుకొండ లయోలా ఉన్నత పాఠశాలలో చిత్ర కళా ప్రదర్శనను తిలకిస్తున్న కౌన్సిలర్ షకీలా

బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వినుకొండ లయోలా ఉన్నత పాఠశాలలో శనివారం రాష్ట్ర స్థాయి చిత్రకళా ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుండి విచ్చేసిన 70 మంది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపుపొందిన చిత్రకారులు 200 కళాఖండాలను ప్రదర్శించారు. చిత్రకళ రంగంలో అంతర్జాతీయ రికార్డులు అవార్డులు సాధించిన సి. కోటేష (నంద్యాల) కళాఖండాలు, ఉభయ తెలుగు రాష్ట్రాలలో, జాతీయ అంతర్జాతీయస్థాయిలో అవార్డులు సాధించిన స్థానిక చిత్రకారులు వజ్రగిరి జస్టిస్ చిత్రాలు, లైవ్ ఆర్ట్ డెమో ఆకటుకున్నాయి. కంచర్ల జాన్ బాబు(పెదకూరపాడు) సేకరించిన వివిధ దేశాల కరెన్సీ, నాణేల ప్రదర్శన అద్భుతంగా ఉన్నట్లు రాష్ట్రంలోని నలుమూలల నుండి విచ్చే సిన విద్యార్థులు, ఉపాధ్యాయులు తెలిపారు. ముఖ్యఅతిథి కౌన్సిలర్ షకీలా మాట్లాడుతూ చిత్రకళా ప్రదర్శన విద్యార్థులలో సృజనాత్మకత పెంపొందించుటకు దోహదపడుతుందని తెలిపారు. విద్యార్థి దశ నుండి చిత్రకళను అభ్యసిస్తే కళాకారులుగా మంచి గుర్తింపు వస్తుందని చెప్పారు. లయోల హైస్కూల్ హెచ్ ఎం ఫాదర్ రవి, మాట్లాడుతూ విద్యార్థులలో చిత్రకళ పట్ల ఆసక్తి ఉన్నా వారిని తల్లిదండ్రులు ప్రోత్సహించడం లేదని, ప్రభుత్వ పాఠశాలలో డ్రాయింగ్ టీచర్లను నియమించి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని కోరారు. జాతీయ చిత్రకారుడు వజ్రగిరి జస్టిస్ మాట్లాడుతూ పలువురు జాతీయ చిత్రకారులు, వర్ధమాన చిత్రకారుల కుంచల నుండి జాలువారిన కళారూపాల ప్రదర్శన విశేషంగా ఉందన్నారు. చిత్రకారుడు సి.కోటేష్ మాట్లాడుతూ ప్రకృతి నుండి మానవుడు నేర్చుకోవాల్సింది చాలా ఉందన్నారు. చిత్రాలు గీయడంకాదు ఎంత పరి పూర్ణంగా గీశామనేదే ముఖ్యమని తెలిపారు. సుపీరియర్ ఫాదర్ జ్ఞానదేవ్, కౌన్సిలర్, మార్కెట్ యార్డ్ చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు ఎంఎస్ కె బాషా, ఎన్.నరసింహారావు,జి.కోటేశ్వరరావు, రెడ్డి నాగ పద్మ, ఎంపిపి వెంకట్రామిరెడ్డి, శావల్యా పురం ఎంపిపి ఎం.అనిల్ కుమార్ పాల్గొన్నారు.

తెనాలి 'జెఎంజె'కు ప్రథమ స్థానం

ముగిసిన ఎఎన్‌యు అంతర కళాశాలల మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

మాట్లాడుతున్న రామశేషగిరిరావు

ప్రజాశక్తి - నరసరావుపేట

మండలంలోని కేసానుపల్లిలోని ఎం ఎఎం ఫార్మసీ కళాశాలలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర కళాశాలల మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు శనివారంతో ముగిశాయి. శనివారం జరిగిన ఆటల పోటీలను కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ మేదరమెట్ల రామ శేషగిరి రావు ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడల ఆవశ్యకత గురించి మాట్లాడారు. శనివారం జరిగిన పోటీలలో వివిధ ప్రాంతాల నుండి కళాశాల జట్లు తలపడగా, తెనాలి జె.ఎం.జె మహిళా కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించగా ఎంఎఎం ఫార్మసీ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానం, తృతీయ స్థానంలో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, నాల్గో స్థానంలో ఈపూరు మండలం ముప్పాళ్ల ధనలక్ష్మి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల విద్యార్థులు నిలిచారు. ముఖ్యఅతిథిగా నెల్లూరి హాస్పిటల్స్ అధినేత డాక్టర్ నెల్లూరు రమేష్, పృథ్వి కన్‌స్ట్రక్షన్స్ అధినేత దరువూరి పృథ్వి పాల్గొని మాట్లాడారు. పోటీల్లో గెలుపోటములు సహజమని, అందరూ క్రీడా స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ పోటీలకు సెలక్షన్ కమిటీ మెంబర్స్ జిపిఎంఆర్ నీలా కుమారి, వైఎ గవర్నమెంట్ కన్ చీరాల, డాక్టర్ సిహెచ్ వెంకట్రావు ధనలక్ష్మి ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజ్ ముప్పాళ్ళ, డాక్టర్ కె అరుణ సుజాత జెఎంజె ఉమెన్స్ కళాశాల వారు వ్యవహరిస్తున్నారు అని తెలియజేశారు. సెలక్షన్ కమిటీ సభ్యులు సెలెక్ట్ చేసిన విద్యార్థులు నాగార్జున యూని వర్సిటీ తరపున అంతర యూనివర్సిటీ పోటీలలో పాల్గొంటారని అన్నారు. అంతర యూనివర్సిటీ పోటీలు అబ్దుల్ రెహమాన్ యూనివర్సిటీ, చెన్నైలో జనవరి 27 నుంచి 30 వరకు జరుగుతాయని అన్నారు.

కాకుమానులో జగనన్న ఇళ్ల స్థలాల లేఅట్లను పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు.

ఫిరంగిపురం మండలంలో జగనన్న లేఅవుట్లను పరిశీలిస్తున్న సిపిఎం బృందం

పేదల ఇళ్లకు పడని పునాది.. స్థలాల్లో మొక్కలు, పిచ్చికంప

● రూ.5లక్షలు కేటాయించి, మౌలిక వసుతుల కల్పించాలని సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - పెదనందిపాడు జగనన్న కాలనీలలో మౌలిక వసతులు కల్పించాలని, ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు, శనివారం కాకుమాను మండలంలోని కొమ్మూరు, కాకుమాను గ్రామాలలో జగనన్న ఇళ్ల స్థలాల లేఔట్లను సిపిఎం బృందం ఆధ్వర్యంలో పరిశీలించారు, ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ మండలంలోని కొమ్మూరు గ్రామంలో 400 మందికి , కాకుమాను గ్రామంలో 226 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారని, నిర్మాణాలు చేపట్టక వాటిలో పిచ్చి కంప, తుమ్మ చెట్లు పెరిగాయని తెలిపారు, ఇళ్ల స్థలాలకు మౌలిక వసతులైన విద్యుత్,మెరక, రోడ్డు, నీటి వసతి కల్పించాలని కోరారు, అదేవిధంగా సిమెంటు, ఇసుక, ఇనుము ధరలు విపరీతంగా పెరిగినందువల్ల ప్రభుత్వం ఇచ్చే రూ.1,80,000 బేస్మెంట్ స్థాయి వరకు మాత్రమే సరిపోతున్నాయని, ప్రతి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5లక్షలు కేటాయించాలని కోరారు, సెకండ్ ఫేజ్‌లో ఉన్నందువల్ల మండలంలో ఇళ్ల స్థలాల నిర్మాణం ఇంకా చేపట్టలేదని అధికారులు తెలిపారని, వీలైనంత త్వరలో ఇళ్ల స్థలాల నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు కాకుమాను నాగేశ్వరరావు,కాకుమాను, పెదనందిపాడు మండల కార్యదర్శులు కందుల శ్రీనివాసరావు, దొప్పలపూడి రమేష్ బాబు మండల నాయకులు చుక్కా యానాదులు, మద్దూరి రమణ, కొత్త వెంకటశివరావులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఫిరంగిపురం

మండలంలోని తక్కెళ్ళపాడు, తాళ్లూరు సిరంగి పాలెం, గ్రామాలలోని జగనన్న కాలనీలను సిపిఎం బృందం శనివారం సర్వే నిర్వహించింది. తక్కెళ్ళపాడులో 16 మందికి స్థలాలు మంజూరు చేయగా ఒక్కరు మాత్రమే ఇంటి నిర్మాణం చేశారు. ఆ ఇంటికి రహదారి సరిగా లేదు. మిగిలిన 15 మంది స్థలాలలో గడ్డి మొలసి కంపచెట్లతో నిండిపోయింది. ఆ స్థలాలు స్మశాన వాటికకు దగ్గరగా ఉండటం, అక్కడ చెరువు ఉండటం వల్ల లబ్ధిదారులు ఎవరూ ఆ ప్రాంతంలో ఇల్లు నిర్మించేందుకు ముందుకు రావడానికి ఇష్టపడుటలేదు. 113 తాళ్లూరు, సిరంగిపాలెం గ్రామాలుకు కలిపి 23 మందికి స్థలాలను కేటాయించగా సిరంగిపాలెంలోని ఎస్సీ కాలనీలో నలుగురు మాత్రమే ఇంటి నిర్మాణం చేసుకున్నారు. మిగిలిన లబ్ధిదారులు కేటాయించిన స్థలాలు సిరంగిపాలానికి,113 తాళ్లూరుకి దూరంగా ఉండటంవల్ల అక్కడ ఇళ్ల నిర్మించుకొనుటకు లబ్ధిదారులు ఎవరు సుముఖంగా ఉండటం లేదు. ప్రభుత్వం ప్రకటించిన సహాయం సరిపోవడం లేదని ప్రతి ఇంటికి కనీసం రూ.5లక్షలు కేటాయించాలని, కాలనీలకు సరైన రహదారులు విద్యుత్తు ,తాగునీటి సౌకర్యాలు చేపట్టాలని లబ్ధిదారులు సిపిఎం బృందానికి తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, సీనియర్ నాయకులు మార్పుల వెంగల్ రెడ్డిలు పాల్గొన్నారు.

ప్రభుత్వ హామీ మేరకు ప్రత్యామ్నాయ స్థలాలు చూపాలి

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజాశక్తి-తాడేపల్లి

పట్టణంలోని బోటు యార్డు దగ్గర 30 గజాల తాత్కాలిక స్థలంలో నివాసముంటున్న ప్రజలకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ స్థలాలు చూపించాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని బోటుయార్డు, సీతానగరం, కెఎల్‌రావు కాలనీ, అంజిరెడ్డి కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 గజాల స్థలంలో పేదలు ఎలా నివసిస్తారో పాలకులు ఒకసారి ఆలోచించాలని కోరారు. తాము అధికారంలోకి వస్తే పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం వెంటనే తన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. బోటు యార్డు వద్ద ఏర్పాటు చేసిన సామూహిక మరుగుదొడ్లను పందులకు ఆవాసాలుగా మారాయని స్థానికులు సిపిఎం బృందం చెప్పారు. బాత్రూమ్‌లకు ఉన్న డోర్లను కూడా తీసుకెళ్లి ఒక పెంపకం దారుడు ఇష్టానుసారం మరుగుదొడ్లను వాడుకుంటున్న వైనాన్ని పరిశీలించారు. కెఎల్‌రావు కాలనీలో 20ఏళ్ల క్రితం సిపిఎం పాలనలో నిర్మించిన మెట్లు ధ్వంసమయ్యాయని స్థానికులు తెలిపారు. ప్రస్తుతం నడిచేందుకు కూడా వీలులేకుండా ఉందని, మెట్లు ఏర్పాటు చేయాలని కోరారు. అంజిరెడ్డికాలనీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం సందర్భంగా హౌసింగ్ స్కీమ్ కింద అధికారులు, లబ్ధిదారుల నుండి తీసుకున్న ఇళ్ల పట్టాలను ఇంతవరకూ ఇవ్వలేదని సిపిఎం బృందం ముందు వాపోయారు. వన్‌టైమ్ సెటిల్ మెంట్ కింద రూ.12 వేలు చెల్లిస్తే పట్టాలిస్తామని చెప్పిన అధికారులు, సొమ్ములు చెల్లించినా పట్టాలివ్వలేదని సిపిఎం నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న మనిషికి ఐదు కిలోల ఉచిత బియ్యం తమకు అందడం లేదని ఆ పేటలోని పలువురు నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. స్థానికంగా బకింగ్‌హామ్ కెనాల్‌లోకి వెళ్లే డ్రైనేజ్ పెద్ద తూము పూడుకుపోయిందని స్థానికులు తెలిపారు. దీంతో మురుగుపోయేందుకు వీలులేక దుర్వాసన వెద జల్లుతోందని వాపోయారు. వెంటనే మురుగునీరు పోయేలా పూడికతీయడంతో పాటు, పెద్ద ఎత్తున పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని అధికారులను సిపిఎం బృందం కోరింది. డ్రైనేజ్ పక్కనే మంచినీటి పైపులు ఉన్నాయని, అవి తుప్పుపట్టి పాడైపోతే మంచినీటితో పాటు మురుగునీరు కూడా ట్యాపుల ద్వారా ఇళ్లలోకి వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే వీటికి మరమ్మతులు చేపట్టాలని సిపిఎం నాయకులు కోరారు. పట్టణంలో హామీపత్రాలు ఇచ్చిన వేలాది మందికి ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇవ్వాలని కోరారు.రాజధానిలో వీరందరికి ప్లాట్లు ఇస్తామని చెప్పిన అధికారులు ఇంత వరకూ వాళ్ల ఊసెత్తడం లేదని చెప్పారు. పేదలకు రాజ ధానిలో ఇస్తామన్న ఇళ్ల ప్లాట్లు ఎండమావిగా మారాయని ఈ సందర్భంగా రామారావు విమర్శించారు. తాడేపల్లి ప్రాంతంలో నివాసముంటున్న సుమారు వెయ్యి మంది బాధితులకు ప్రత్యామ్నాయ స్థలాలు ఇచ్చి, పట్టాలివ్వాలని కోరారు. ప్రస్తుతం ఉంటున్న ఇళ్ల పైకప్పులు కూలడానికి సిద్ధంగా ఉన్నా పునర్నిర్మాణం చేసుకోవడానికి అధికారులు అవకాశం కల్పించకపోవడం బాధాకరమన్నారు. బైపాస్ రోడ్డు వెంట అపార్టుమెంట్ల నుండి వస్తున్న మురుగు పోవడానికి వీలుగా ఎస్‌టిపిలను ఏర్పాటు చేసి మురుగు నివారణా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కృష్ణనగర్ ప్రాంతంలో ఫారెస్ట్ ప్రాంతాన్ని డి-ఫారెస్ట్ చేసి పట్టాలివ్వాలని కోరారు. ఇప్పటికే పట్టణంలో ముగ్గురోడ్డు, సుందరయ్యనగర్, వెంకయ్య కొట్టు సెంటర్ తదితర ప్రాంతాల్లో సిపిఎం బృందం పర్యటించి సమస్యలను అధికారులకు తెలియజేసిన సంగతిని గుర్తుచేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కె.కరుణాకర్‌రావు, ఎస్.ముత్యాలరావు, డివి భాస్కర్‌రెడ్డి, వి.సామేలు, కె.మేరి, బి.గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధితులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

రేపు ధర్నా.. పట్టణంలో వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు సిపిఎం పట్టణ కమిటి తెలిపింది. సమస్యలతో ఇబ్బందిపడుతున్న బాధితులు ధర్నా కార్యక్రమానికి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

కెఎల్‌యులో క్రెడిట్-ఆధారిత క్యాప్‌స్టోన్ ప్రాజెక్ట్ ప్రారంభం

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్

కెఎల్‌యు క్రెడిట్-ఆధారిత క్యాప్‌స్టోన్ ప్రాజెక్ట్‌ను వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ శనివారం నూతనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సంఘం ద్వారా తమ విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ విభాగాలలోని విద్యార్థుల కోసం ఈ వర్క్‌షాప్‌ల శ్రేణిని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఈ సదస్సులో పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు.సిబ్బందితో సహా 110 మంది పాల్గొన్నారు. ఈ వర్క్‌షాప్ వర్చువల్ సదస్సుకు పూర్వ విద్యార్థుల-సంబంధాల డైరెక్టర్ డాక్టర్ కె. సిహెచ్ . శ్రీ కావ్య అద్యక్షత వహించారు. డాక్టర్ శ్రీకావ్య మాట్లాడుతూ ఈ క్యాప్ స్టోన్ ప్రాజెక్టు ప్రతి బ్యాచ్ విద్యార్థుల కోసం నాలుగు వారాల సైకిల్‌గా నిరంతరంగా నడుస్తుందన్నారు. ప్రిన్సిపాల్ డా.ఎల్.కోటేశ్వరరావు కూడా పూర్వ విద్యార్థుల విభాగాన్ని ప్రత్యేకంగా అభినందించారు ఈ కార్యక్రమంలో పరిశ్రమ నిపుణులు, మిస్టర్ కిరణ్ పల్లా, సిఐఒ నెట్‌వర్క్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు, ఎగ్జిక్యూటివ్ మెంటార్, చీఫ్ టెక్నాలజీ అడ్వైజర్, సిటిఒ అకాడమీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు, 1988-92 (మెకానికల్), మిస్టర్ రామ్ మోర్ల, డేటా ఎంటర్‌ప్రైజ్ హెడ్ ఈ వర్క్‌షాప్‌లకు నాయకత్వం వహించారు. ఆర్కిటెక్చర్ ఇన్ కాగ్నిజెంట్, 1986-90 (సిఇఒ) సత్య చిగురుపాటి, సీనియర్ సలహాదారులు ఎంటర్‌ప్రైజ్ డేటా అనలిటిక్స్, ఇన్‌సైట్స్, 1984-88 (సివిల్) వారు వారి సంబంధిత రంగాలలో వారి నైపుణ్యం,అనుభవాలను పంచుకున్నారు ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో.విసి.డాక్టర్ ఎన్. వెంకట్రామ్, రిజిస్ట్రార్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్‌లు పాల్గొన్నారు.





పన్ను బకాయి రూ.21 లక్షలు చెల్లించాలని కాటూరి హాస్పిటల్‌కు నోటీసు

ప్రజాశక్తి- ప్రత్తిపాడు

ఫైనాన్షియల్ ఇయర్ 2021-22 ఆర్థిక సంవత్సరం బకాయి రూ. 21,15,298లు, అలాగే 2022 - 2023 ఆర్థిక సంవత్సరం బకాయి 22,62,000ల బకాయి మొత్తాన్ని చెల్లించాలి అని అనేక మార్లు నోటీసులు ఇచ్చినా కాటూరి యాజమాన్యం స్పందించక పోవడంతో మండల పంచాయతీ అధికారి మావులూరి మోషే , మండలంలోని అన్ని గ్రామల పంచాయతీ కార్యదర్శులు, మహిళ పోలీసులు కలిసి కాటూరి హాస్పటల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలోని హాస్పటల్ ఎఒ రాయపాటి వెంకట్‌కు నోటీసులు అందచేశారు. ఈ సందర్భంగా రాయపాటి వెంకట్ మాట్లాడుతూ ఒక ఆర్థిక సంవత్సరం బకాయి మాత్రమే చెల్లిస్తామని మిగతా బకాయి వచ్చే సోమవారం ఎప్పటిలోగా చెల్లిస్తామో తెలియజేస్తామని మండల పంచాయతీ అధికారులకు తెలియజేశారు. ఎప్పటిలోగా చెల్లిస్తామని కాదు ఏ తారీఖున చెల్లిస్తారో తెలపాలని అధికారులు అన్నారు. దీంతో మా యాజమాన్యానికి తెలియజేయాలని అక్కడ నుంచి అప్రూవల్ వస్తే మాత్రమే మాట ఇవ్వగలుగుతామని రాయపాటి వెంకట్ తెలిపారు. సోమవారం లోపు ఎప్పుడు చెల్లిస్తారో తెలపాలని పంచాయతీ అధికారి సిబ్బందితో చెప్పారు. లేకుంటే మళ్లీ వచ్చి నోటీసులిస్తామని, ప్రతి ఆర్థిక సంవత్సరం పన్నులు చెల్లించడం లేదని మేము మీకు నోటీసులు ఇవ్వటం ఆ తర్వాత చెల్లించడం జరుగుతుందని ఆయన వారికి గుర్తు చేశారు. 2021- 22 ఆర్థిక సంవత్సరం సంబంధించి చెక్కు ఇవ్వడంతో పంచాయతీ అధికారులు వేను తిరిగారు.

మాట్లాడుతున్న డిటిసి కరీం

రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం అవగాహన

ప్రజాశక్తి-తెనాలి

వాహనాలను నడిపే క్రమంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని, రవాణా శాఖ నిబంధనలు పాటించటం ద్వారా ప్రమాద రహిత జిల్లా కావాలని జిల్లా ఉప రవాణా కమిషనర్ కరీం అన్నారు. ఈనెల 18 నుంచి ప్రారంభమైన జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక రామలింగేశ్వరపేట మున్సిపల్ ఓపెన్ ఆడిటోరియం ప్రాంగణంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆటోలు, కార్లు, ట్రాక్టర్లు, ప్రైవేటు బస్సుల డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఇటీవల పరిమితికి మించి ప్రయాణిస్తూ పెదరావూరు శివారు ప్రాంతంలో ప్రమాదానికి గురైన అయ్యప్పభక్తులు, అలాగే రెంట చింతల వద్ద టాటా ఏస్‌లో 27 మంది అయ్యప్ప భక్తులు ప్రయాణిస్తూ ఏడుగురు మృత్యువాత పడిన తీరును వివరించారు. రవాణా వాహనాల్లో ప్రజలు ప్రయాణించటం, పరిమితికి మించిన లోడుతో వాహనాలు నడపటం ప్రమాదాలకు మూలంగా చెప్పారు. అలాగే సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపటం ద్వారా ఎదురైన ప్రమాదాలను వివరించారు. కార్యక్రమంలో గుంటూరు ఎంవిఐ జంగాల అనిల్, తెనాలి ఎంవిఐ కె.రాఘవరావు, ఏఎంవిఐ మధుసూధనరావు, పట్టణ త్రీటౌన్ సిఐ యు.శ్రీనివాసులు, ఆర్టీసి డిపో మేనేజర్ రాశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులకే అధిక ప్రమాదాలు

- పల్నాడు ఎస్పీ రవిశంకర్‌రెడ్డి
- ప్రమాదాల నివారణ కోసం ర్యాలీ

ప్రజాశక్తి-నరసరావుపేట

అధిక శాతం ప్రమాదాలకు గురవుతోంది ద్విచక్ర వాహనదారులేనని, వారు వాహనం నడిపేటపుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పల్నాడు ఎస్పీ రవి వై. శంకర్ రెడ్డి అన్నారు. ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తూ పోలీస్ సిబ్బందితో హెల్మెట్ ధరించి పట్టణంలో ద్విచక్ర వాహన ర్యాలీ చేపట్టారు. పల్నాడు జిల్లాలో 34 వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా శనివారం 2 వ పట్టణ పోలీస్ స్టేషన్ నుండి మల్లమ్మ సెంటర్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వరకు హెల్మెట్లతో మోటార్ సైకిల్ ర్యాలీ జరిగింది. ముఖ్యఅతిథిగా ఎస్పి పాల్గొని ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించినప్పుడే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని

జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న ఎస్పి రవిశంకర్‌రెడ్డి

అన్నారు. సుమారు 60 మంది మోటార్ సైకిల్స్ తో ఈ ర్యాలీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి టి. కె. పరందామరెడ్డి, డి.ఎస్.పి విజయ్ భాస్కర్, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లుసత్యనారాయణ ప్రసాద్, రాంబాబు, శ్రావ్య, సి.ఐ.లు, ఎస్.ఐ లు పాల్గొన్నారు.

ఎక్కువసార్లు ఓటేసిన వృద్ధులను సత్కరించాలి

- 25న ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించండి
- సమీక్షా సమావేశంలో డిఆర్‌ఒ వినాయకం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జనవరి 25న జరిగే 13వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ బూత్‌ల్లో ఘనంగా నిర్వహించాలని జిల్లా రెవిన్యూ అధికారి వినాయకం ఆదేశించారు. శనివారం సాయంత్రం .బి.ఆర్.అంబేద్కర్ స్పందన హాల్ లో జాతీయ ఓటర్ల దినోత్సవం వేడుకల నిర్వహణపై ఆయా శాఖల జిల్లా అధికారులు, కళాశాల ప్రిన్సిపల్స్,ప్రభుత్వ పాఠశాలల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధానంగా అన్ని రెవెన్యూ డివిజన్ , మండల, పోలింగ్ బూతు అధికారులు తప్పని సరిగా అన్ని బూత్‌లలో జాతీయ ఓటర్ల దినోత్సవం వేడుకలను తప్పనిసరిగా నిర్వహించాలని చెప్పారు. జనవరి 25 నాటికి కొత్తగా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి జాతీయ ఓటర్ల దినోత్సవం రోజున నూతనంగా ఓటరు కార్డులను పంపిణీ చేయాలన్నారు. అదేవిధంగా ఎక్కువ సార్లు ఓటుహక్కు వినియోగించుకున్న వృద్ధులను సత్కరించాలని అన్నారు. ట్రాన్స్ జెండర్స్ కూడా తప్పకుండా ఓటుహక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని, వారికి ఓటరు గుర్తింపు కార్డులు తప్పని సరిగా అందజేయాలని ఆదేశించారు. ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఆయా కళాశాలలు, స్కూల్స్ లో విద్యా ర్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, వక్తృత్వ పోటీలను

నిర్వహించాలని, మండల స్థాయి, డివిజన్ స్థాయిలో పోటీల్లో గెలుపొందిన విజేతలను 25న జిల్లా కేంద్రంలో పోటీలను నిర్వహిస్తామన్నారు. ఇక్కడ గెలుపొందిన వారని అంతర్ జిల్లాల స్థాయిలో పోటీలను నిర్వహించి, రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు పంపుతామన్నారు. సమావేశంలో ఆయా శాఖల జిల్లా అధికారులు, కళాశాల ప్రిన్సిపల్స్, ప్రభుత్వ పాటశాలల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులకు సహకరించండి

పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి- పిడుగురాళ్ల

పట్టణంలో రోడ్డు విస్తీర్ణ పనులకు షాపు యజమానులు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు కోరారు. గతంలో డివైడర్‌కు ఇరువైపులా 10.5 మీటర్లు రోడ్డు విస్తరణ చేపట్టేందుకు మున్సిపల్ కార్యాలయం సిద్ధపడిందన్నారు. అయితే, కొందరు షాపు యజమానులు కోర్టును ఆశ్రయించగా, ఈ కేసు కొట్టి వేశారన్నారు. పట్టణంలో సుమారు 51 షాపులు యజమానులు డివైడర్ నుంచి 12.8 మీటర్ల రోడ్డు విస్తరణ అవసరమని షాపు యజమానులకు నోటీసులు అందించటం జరిగిందని తెలిపారు. షాపు యజమానులకు అవసరమైతే నష్టపరిహారం అందించి, 12.8 మీటర్ల మేర రోడ్డు నిర్మించేందుకు మునిసిపల్ కార్యాలయం సిద్ధంగా ఉందన్నారు. ఈ విషయంపై షాపు యజమానులకు ఏమైనా సందేహాలు ఉంటే రాతపూర్వకంగా మున్సిపల్ కార్యాలయానికి సమర్పించాలని కమిషనర్ తెలిపారు.

ఆర్టీసీ డిపోకు డీజిల్ సరఫరాకు టెండర్

ప్రజాశక్తి- పిడుగురాళ్ల

పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో ప్రతిరోజు 400 లీటర్ల డీజిల్ సప్లై చేసేందుకు ఆసక్తి గలవారు టెండర్ దాఖలు చేయాలని ఆర్టీసీ డిపో మేనేజర్ ఎన్.ముక్తేశ్వరరావు తెలిపారు. టెండర్ దాఖలు చేయదలచిన వారు జనవరి 22వ తేదీ నుంచి ఫిబ్రవరి రెండో తేదీ సాయంత్రం నాలుగు గంటల లోపు డిపో మేనేజర్ ఆఫీస్‌లో సంబంధిత ఫారం తీసుకొని ఫిబ్రవరి 2వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలలోపు ఆఫీసులోని సీల్డ్ బాక్సులో వేయాలని తెలిపారు.. సాయంత్రం నాలుగు గంటల తర్వాత ఈ బాక్స్ ఓపెన్ చేసి లోకల్ రిటైల్ ప్రైస్ మీద ఎక్కువ డిస్కౌంట్ ఆఫర్ చేసిన వారికి అవకాశం కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని పిడుగురాళ్ల పట్టణ పెట్రోల్ బంక్ ఓనర్లు సద్వినియోగం చేసుకోవాలిని అన్నారు.



రైతులకు అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-అచ్చంపేట

ఎస్సి,ఎస్‌టి రైతులు, కౌలు రైతులు ప్రకృతి, సేంద్రీయ వ్యవసాయ పద్ధతుల్లో వ్యవసాయాన్ని కొనసాగించాలని చల్లగారిగ సర్పంచ్ యాంపోగు పెద్ద పుల్లారావు అన్నారు. మండలంలోని చల్లగారిగలో శనివారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు అచ్చంపేట మండల కన్వీనర్ సందెపోగు అశోక్, సాగర్ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆవుపేడ, గోమూత్రం, శనగపిండి, ఎర్రమట్టి, బెల్లం అన్నింటి ద్వారా జీవామృతం తయారు చేసి ప్రత్తి, మిరప తోటలకు పిచికారీ చేయాలని రైతులకు సూచించారు ఈ విధంగా చేస్తే మన పంట పొలాలు సారవంతం మారటమే కాకుండా వేసిన పంటలు పుష్కలంగా దిగుబడి వస్తుందని, మొక్కలు ఆరోగ్యంగా ఉంటాయని సూచించారు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ జిల్లా కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్ సి,ఎస్ టి రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు ప్రోత్సహించేందుకు రూ.50 వేలు రుణం ఇస్తుందని, ఇందులో రూ.10 వేల రాయితి ఇస్తుందని, మిగిలిన నలభై వేల రూపా యలు విడతల వారీగా చెల్లించాలని తెలిపారు. రవి, మస్తాన్, స్వామి, జార్జి, అచ్చారావు ,వేమవరపు సంసోను ,సాంబయ్య, వివిధ గ్రామాల నుంచి ఎస్సీ ఎస్టీ రైతులు పాల్గొన్నారు.

నేడు సినిమా పాటలు, పద్యాల పోటీలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఘంటసాల, ఎన్‌టి రామారావుల శత జయంతిని పురస్కరించుకుని స్థానిక కళా సంస్థ ఘంట సాల గానసుధ ఆధ్వర్యంలో ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి తెలుగు సినిమా పాటలు, పౌరాణిక పద్యాల పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ సంస్థ అధ్యక్ష కార్యదర్శులు జి.రామారావు, బి.కోటయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం10 గంటలకు స్థానిక మోడరన్ కాంప్లెక్స్ లోని వాసవి గ్రాంట్స్ ఫంక్షన్ హాల్‌లో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రెండు విభాగాలలో విడివిడిగా ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్ద బహుమతులు వరుసగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.1500 నగదు పారితోషికం, జ్ఞాపికలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే, మూడు కన్సోలేషన్, మూడు ప్రోత్సహక బహు మతులతో పాటు 5 ప్రత్యేక బహుమతులు, జ్ఞాపికలు ఇస్తామని వివరించారు. వివరాలకు ఎ.వి. శివయ్య, మొబైల్ నెంబర్ 9493775555లో సంప్రదించాలని తెలిపారు.

ఎన్నికలకు ఎక్కువ సమయం లేదు.. : ప్రత్తిపాటి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఎన్నికలకు ఎక్కువ సమయం లేదని, పార్టీ నేతలు, క్లస్టర్స్ యూనిట్ ఇన్‌ఛార్జులు, బూత్ లెవెల్ కన్వీనర్లు మరింత దూకుడు పెంచాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. తెలుగుదేశం పార్టీ సమీక్షా సమావేశాలలో భాగంగా శనివారం స్థానిక పండరీపురంలోని తన నివాసంలో ప్రత్తిపాటి ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. 14,18 వార్డుల ప్రెసిడెంట్‌లు, సెక్రటరీలు, బూత్ లెవెల్ కన్వీనర్లు పాల్గొ న్నారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం గురించి, ముఖ్యంగా ఓట్ల తొలగింపు, చేర్పు లకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బూత్ కన్వీనర్ల బాధ్యత వంటి అంశాలపై ప్రస్తావించారు. ప్రత్తిపాటి మాట్లా డుతూ జగన్ ప్రభుత్వం తీరుపై ప్రజలు విసుగెత్తారని, పథకాలు, ప్రకటనలు ఒట్టి డొల్ల అని ప్రజలు గ్రహించారని అన్నారు.

సమావేశం లో మాట్లాడుతున్న ఎంపిడిఓ జివి సత్యనారాయణ

ఉపాధి హామీ పనుల తనిఖీకి సహకరించాలి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు తనిఖీ చేసేందుకు వచ్చిన సామాజిక తనిఖీ బృందాలకు పంచాయతీ కార్యదర్శులు ఉపాధి హామీ సిబ్బంది సహకరించాలని ఎంపిడిఓ జీవి సత్యనారాయణ ఆదేశించారు. సత్తెనపల్లి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు ఉపాధి హామీ సిబ్బంది తో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. 2021 ఏప్రిల్ నుండి 2022 మార్చి 31వరకు జరిగిన 1500పనులకు గాను మెటీరియల్ కాంపోనెంట్ తో కలిపి సుమారు 25కోట్లమేర పనులు జరిగాయి. పనుల్లో జరిగిన అవకతవకలను వేలికి తీసేందుకు సోషల్ ఆడిట్ జరుతున్నందన వారికి సహకరించాలని కోరారు. ఈసమావేశంలో ఎంపిపి యలవర్తిపాటి జైబున్ బీ మండల ప్రత్యేక అధికారి ఎ సుధాకర్ పాల్గొన్నారు

'సుప్రీం తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు'

ప్రజాశక్తి - చిలకలూరిపేట : జిఒ నంబర్ 1పై హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేయడం అన్యాయమని ఎపి గిరిజన సం ఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.శీనునాయక్ విమర్శించారు. ఎపిలో రహదారు లపై రోడ్డు షోలు, సభలు, సమావేశాల నియంత్రణ కోసం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన శనివారం స్థానిక ఎన్‌ఆర్‌టి సెంటర్‌లోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూఎపిలో రహదారులపై రోడ్డు షోలు, సభలు, సమావేశాల నియంత్రణ కోసం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఈ జిఒపై హైకోర్టు విచారణలో తాము జోక్యం చేసుకోలేమని సుప్రీంకోర్టు పేర్కొనడం ప్రభుత్వానికి చెంపపెట్టని అన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలపై గిరి జన సంఘాల తరపున హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చిత్తశుద్ధితో ఈ జిఒను ఉపసంహరించుకోవాలని శ్రీను నాయక్ డిమాండ్ చేశారు.

గోళ్లపాడులో పంటకోత ప్రయోగం

ప్రజాశక్తి-ముప్పాళ్ల

వైఎస్సార్ ఉచిత పంటల బీమా, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో భాగంగా మండలంలోని గోళ్ళపాడులో శనివారం వ్యవసాయ శాఖ,ఎస్‌బిఐ జనరల్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో వరి లో పంట కోత ప్రయోగం నిర్వహించారు. గోళ్ళపాడుకు చెందిన రైతు చింకా నాగరాజుకు చెందిన వరి పొలంలో ఎకరానికి సుమారుగా 40 బస్తాల దిగుబడి వచ్చింది. అదే గ్రామంలోనే మరొక పంట కోత ప్రయోగం నిర్వహించగా ఎకరానికి సుమారు 35 బస్తాల దిగుబడి వచ్చింది. ఈ పంట కోత ప్రయోగంలో పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి పర్యవేక్షణాధికారిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటకోత ద్వారా పైరు దిగుబడి అంచనా వేయవచ్చని చెప్పారు. ఈ ప్రయోగాన్ని సీసీఈ యాప్‌లో డేటా అప్లోడ్ చేస్తే రియల్ టైం డేటా జిల్లా, రాష్ట్ర విభాగాలకు చేరుతుందన్నారు. ఈ సందర్భంగా ఈ- పంట నమోదు గురించి మండల వ్యవసాయాధికారులను అడిగి తెలుసు కున్నారు. ఈ నెలాఖరు లోపు ఈ-పంట నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. మండల వ్యవసాయాధి కారిణి అరుణ, గ్రామ సచివాలయ అగ్రి అసిస్టెంట్లు,రైతులు పాల్గొన్నారు

వనికుంటలో ..

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని వనికుంటలో రైతు దారా లక్ష్మయ్య వరి పొలంలో పంట కోత ప్రయోగం చేశారు. మండల గణాంకాధికారి నాగ శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ విస్తరణాధికారి బి. అప్పారావు పర్య వేక్షించారు. జేజీఎల్-384 రకం ఎకరాకు సుమారుగా 44 బస్తాలు దిగుబడి వచ్చినట్లు అంచనా వేశారు. గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులు కె.ఆనంద్‌బాబు, ఎస్‌బిఐ బీమా ప్రతినిధి సిహెచ్ శ్రీను పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల కాంట్రాక్ట్ పొడిగింపుపై హర్షం

ప్రజాశక్తి - తుళ్లూరు

2025 మార్చి వరకు రాజధాని పారిశుధ్య కార్మికులు పని కొనసాగించేలా కాంట్రాక్ట్ గడువును పొడిగించడం పై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు,రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎం రవి హర్షం వ్యక్తం చేశారు. శనివారం విజయవాడలో సిఆర్‌డిఎ కమిషనర్ వివేక్ యాదవ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.పని భద్రత, పెండింగ్ బకాయిల కోసం రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేసిన ఫలితంగా సిఆర్‌డిఎ ఎగ్జిక్యూటివ్ కమిటీ రాజధాని పారిశుధ్య కార్మికులకు 2025వ సంవత్సరం మార్చి వరకు శానిటేషన్ పని పొడిగిస్తూ తీర్మానం చేయడం పట్ల ఆనందం వెలిబుచ్చారు. కార్మికుల ఆందోళనకు మద్దతు తెలిపిన వారందరికీ వారు ధన్యవాదాలు తెలిపారు. పారిశుధ్య కార్మికులకు పెండింగ్ పిఎఫ్‌ను కూడా జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. ఈఎస్‌ఐ కార్డులలో ఏర్పడిన సాంకేతిక ఇబ్బందులను తొలగించి కార్మికులందరికీ ఈఎస్‌ఐ కార్డులు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

చిరు వ్యాపారికి చెక్క బల్ల బండి పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో శనివారం చిరు వ్యాపారి అలపర్తి సాంసోనుకు టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ సహకారంతో చెక్కబల్ల బండిని అందజేసినట్లు టిడిపి తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు తెలిపారు. కూరగాయలు, ఆకుకూరలు అమ్ముకునే తనకు టిడిపి నాయకులు ఈ బండి సహాయం చేయడం పట్ల అలపర్తి సంసోను నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి కుంచనపల్లి గ్రామ అధ్యక్షులు కె. కోటేశ్వరరావు, గ్రామ ప్రధాన కార్యదర్శి బి.రమేష్, క్రిస్టియన్ సెల్ నాయకులు కె.మాణిక్యరావు, తెలుగు మహిళ అధ్యక్షురాలు డి. అరుణ, తెలుగు రైతు మండల కార్యదర్శి సి. శ్రీనివాసరావు, డి. శివయ్య తదితరులు పాల్గొన్నారు.

అరసం ఆధ్వర్యంలో వ్యాస రచన పోటీలు

ప్రజాశక్తి-తెనాలి: అభ్యుదయ రచయితల సంఘం(అరసం) రాష్ట్ర మహాసభల సందర్భంగా విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించటం అభినదనీయమని మండల విద్యాధికారి మేకల లక్ష్మీనారాయణ అన్నారు. వచ్చేనెల 11,12 తేదీల్లో పట్టణంలో నిర్వహించే మహాసభలను పురస్కరించుకుని శనివారం స్థానిక తాలూకా జూనియర్ కళాశాల ఆవరణలో 8 నుంచి 10 తరగతి, అలాగే కళాశాల విద్యార్థులకు నిర్వహిస్తున్న వక్తృత్వం, వ్యాసరచన పోటీల ప్రారంభోత్సవంలో ఎంఈవో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, అరసం పట్టణ అద్యక్షులు కనపర్తి బెన్హర్, డాక్టర్ ఎ.మల్లేశ్వరరావు, షేక్ అస్మతున్నీసా, ఎ. వెంకటేవ్వరరావు, వి.లక్ష్మి, ఎం.అన్నారావు, పి.రవికుమార్, బి.ప్రకాశరావు పాల్గొన్నారు.

నల్లపాడు సిడిపిఓ కార్యాలయంలో వినతిపత్రం అందచేస్తున్న నాయకులు

పొన్నూరు కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి-గుంటూరు

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శనివారం నల్లపాడు సిడిపిఒ కార్యాలయంలో ని అధికారులకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న టిఎ, అలవెన్స్‌లు చెల్లించాలని తదితర డిమాండ్లపై అంగన్‌వాడీలు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలకు క్రమం తప్పకుండా ప్రతి నెలా వేతనాలు చెల్లించాలని కోరారు. వేతనంలో కనీసం రూ.2వేలు ఎదురు ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. గత ఏనిమిది నెలలుగా అద్దె బిల్లులు, వంట ఖర్చులు ఇవ్వకపోవటం వల్ల అంగన్‌వాడీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. నల్లపాడు ప్రాజెక్ట్ పరిధిలో కరెంటు బిల్లులు కట్టలేకపోవటంతో కనెక్షన్లు తొలగించిన కేంద్రాలు కూడా ఉన్నాయన్నారు. మరుగుదొడ్లు ఉన్నా నీరు లేక నిరుపయోగంగా మారాయన్నారు. సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఫిబ్రవరి 6వ తేదీన పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో కృష్ణకుమారి, పద్మ, పద్మరాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు నాయకులు స్థానిక కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు అంగన్వాడి జీతాల బకాయిలు, ఇంటి అద్దె బకాయిలు ఇతర బిల్లుల బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. దీర్ఘకాలంగా ఉన్న అపరిష్కృతతంగా ఉన్న సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ప్రాజెక్టు అధ్యక్షురాలు ఎమ్ .వి. సుకన్య జి. విజయ కుమారి టి. గోవిందమ్మ ఎన్. ఉషారాణి షేక్. రేష్మ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు, క్లీనర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగర పాలక సంస్థలో చెత్త తరలించే వాహనాల డ్రైవర్లు, క్లీనర్లకు పనివేళలు, ఇతర సమస్యలు పరిష్కరించాలని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు కోరారు. శనివారం జిఎంసి ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ, వెహికల్ షెడ్ డిఇ, ఎఇలకు వినతి పత్రం అందజేశారు. డ్రైవర్లు, క్లీనర్లు ప్రతిరోజు ఉదయం 5 గంటలకు డ్యూటీకి వస్తున్నారని, పని ముగించుకొని వెళ్లే సమయం వారి చేతుల్లో లేకుండా పోయిందని తెలిపారు. ఉదయం 5 గంటలకు వచ్చిన వారు సాయంత్రం 6, 7 గంటల వరకు, కొంత మంది రాత్రి 10 గంటల వరకు డ్యూటీ చేయాల్సి వస్తుందన్నారు. రాష్ట్రంలోని విజయవాడ, నెల్లూరు, ఒంగోలు, కడప, అనంతపురం తదితర కార్పొరేషన్లలో చెత్త తరలించే వాహన డ్రైవర్లకు షిఫ్ట్ సిస్టం అమలులో ఉందని తెలియజేశారు.అదే విధంగా గుంటూరు నగరపాలక సంస్థలో కూడా షిఫ్ట్ సిస్టం గానీ, పారిశుధ్య కార్మికుల మాదిరిగా రోజుకు 2 షిఫ్టులు అమలు చేయాలని కోరారు. అలాగే యూనిఫారం, రెయిన్ కోట్లు ఇవ్వాలని, జాతీయ, పండగ సెలవులు, క్యాజువల్ లీవులు, వారాంతపు (ఆదివారం) పూర్తి సెలవు ఇవ్వాలని, చెత్త తరలించే వాహనాలు కండిషన్లో ఉండే విధంగా చూసి ఇన్సూరెన్స్ రెగ్యులర్‌గా చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిఎంసి ఇంజినీరింగ్ విభాగం కన్వీనర్ పి.శ్రీనివాసరావు, కో-కన్వీనర్ పి.లలిత కుమారి ఉన్నారు.

విద్యార్థుల సమగ్ర అభ్యున్నతే లక్ష్యం

ప్రజాశక్తి-పెదనందిపాడు:(కాకుమాను): విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని కాకుమాను మండల విద్యాశాఖ అధికారి కెఎఫ్ కెనడి తెలిపారు. శనివారం కాకుమాను మండల పరిధిలోని అప్పాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (చర్చి కాంపౌండ్), పాఠశాలను ఎంఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన స్థాయిలను పరిశీలించారు. ఉపాధ్యాయుల పనితీరు, పాఠశాల పనితీరు, విద్యార్థుల ప్రగతి స్థాయిలను సమగ్రంగా పరిశీలించారు. విద్యార్థులను అన్ని రంగాలలో తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు.సంగ్రహణాత్మక మూల్యాంకనం-1 లో ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు మంచి మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను అభినందించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని నిర్వాహకులకు తెలిపారు. మరుగుదొడ్లను, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆయాలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గేరా మోహనరావు, ఉపాధ్యాయని మహమ్మద్ షహనాజ్ బేగం, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ కెఎఫ్ కెనడి

కార్యక్రమంలో పాల్గొన్న తెలుగు మహిళ రాష్ట్ర బృందం

మహిళలపై దాడుల నియంత్రణలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి-తెనాలి

మహిళా సాధికారత అంటూ గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం మహిళలపై దాడులను అరికట్టలేకపోతోందని తెలుగు మహిళ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మాసం విజేత అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారధ్యంలో చేపట్టిన మహిళా జాగృతిలో విజేత మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో మహిళలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయన్నారు. మానవత్వం లేకుండా జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టడంలో ప్రభుత్వం విఫల మైందన్నారు. ఎన్ఆర్ఐ కృష్ణప్రియ మాట్లాడుతూ మహిళా జాగృతిలో మహిళలు గళం విప్పాలని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళాలన్నారు. కార్యక్రమంలో కృష్ణబలిజ పూసల ఫెడరేషన్ మాజీ చైర్మన్ కావేటి సామ్రాజ్యం, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు పరుచూరి రమ్య, బి.అరుణ, డి. రమాదేవి, కె.రమాదేవి, బి.జ్యోతి, జె.సుధామాధవి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్

ప్రజా క్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే , వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కిలారి వెంకట రోశయ్య అన్నారు. శనివారం స్థానిక విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాలంటీర్‌ల వ్యవస్థ ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రభుత్వానికి ప్రజలకు వారధులుగా పని చేస్తుందన్నారు. అలాంటి వ్యవస్థపై విషపు ప్రచారాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించడానికి ఇలాంటి ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. దీన్ని రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తున్నారని, ప్రజలే సరైన గుణపాఠం చెబుతారని అన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - మంగళగిరి

దామర్ల శివరామకృష్ణ, రామసీతమ్మ సేవా ట్రస్ట్ మంగళగిరి వారి ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీ ఆదివారం నగరంలోని రాజీవ్ గృహకల్ప రామాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో కళ్లు, ఎముకలు, కీళ్లు, చెవి, ముక్కు, గొంతు, దంతాలు, మూత్రపిండాల నిపుణులైన వైద్య బృందం పరీక్షలు చేస్తారని తెలిపారు. కావున నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ, ఎమ్మెల్యే

జగనన్న కాలనీల్లో పరిశీలన

ప్రజాశక్తి- తెనాలి

జగనన్న కాలనీలో ఇల్లు కలిగి ఉండడం పేదలకు ఓ వరమని రాజ్యసభ సభ్యులు ఆళ్ళ అయోధ్యరామిరెడ్డి అన్నారు. శనివారం తెనాలి పరిధిలోని పెదరవూరులో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కేటాయించిన ప్లాట్లుల్లో గృహ నిర్మాణం పురోగతిని పరిశీలించారు. సెంటు భూమిలో నిర్మాణంలో ఉన్న డూప్లెక్స్ హౌసును చూసి ఆనందం వ్యక్తం చేశారు. ఎంతో సుందరంగా గృహ నిర్మాణాలు జరుగుతున్నాయని అన్నారు. అలాగే రామలింగేశ్వరపేట శివారు పూలే కాలనీలో సెప్టిక్ ట్యాంక్ నిర్మాణాన్ని కూడా పరిశీలించారు. ఆయన వెంట ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, కమిషనర్ ఎం జస్వంత్‌రావు, మున్సిపల్ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు గృహ నిర్మాణ శాఖ సిబ్బంది ఉన్నారు.

పెద్ద కోనేరు మరమ్మతుల పనుల పరిశీలన

ప్రజాశక్తి - మంగళగిరి

నగరంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానానికి చెందిన పెద్ద కోనేరు (కళ్యాణ పుష్కరిణి) మరమ్మతుల పనులను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దేవస్థాన అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. పెద్ద కోనేరు మరమ్మతుల పనులు మరింత వేగవంతంగా నిర్వహించేలా అధికారులకు, కాంట్రాక్టర్‌కు ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. పెద్ద కోనేరులో పూడిక తీసిన సిల్ట్ (మురుగు) రోడ్లపై పడకుండా డంపింగ్‌కు తరలించేలా దేవస్థాన అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కన్వీనర్ ఎం. మల్లేశ్వరరావు, దేవస్థాన ఈఓ ఎ.రామకోటిరెడ్డి పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు అందజేస్తున్న కాండ్రు శ్రీనివాసరావు

కుట్టు మిషన్లు పంపిణీ

ప్రజాశక్తి- మంగళగిరి

మంగళగిరి రత్నాల చెరువు బైపాస్‌లోని శ్రీ తేజోద్భవం సేవా సమితి కార్యాలయంలో సేవా సమితి నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణ శిబిరంలో శిక్షణ పొందిన మహిళలకు శనివారం ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా మాజీ మున్సిపల్ చైర్మన్, టీడీపీ నాయకుడు కాండ్రు శ్రీనివాసరావు హాజరై మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ తేజోద్భవం సేవా సమితి అధ్యక్షురాలు కాట్రు గాయత్రి, టీడీపీ నాయకుడు వాకా మాధవరావు, జొన్నాదుల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ కోసం సర్వే

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

కొండమోడు - పేరేచర్ల రహదారి విస్తరణకు అధికారులు సర్వే చేస్తు న్నారు. రూ.900 కోట్లతో మేడికొం డూరు మండలం పేరేచర్ల నుండి కొండమోడు వరకు 49.9 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల జాతీయ రహదారిని నిర్మించనున్నారు. ఇందుకు అవసరమైన భూములు సేకరించేం దుకు రెవెన్యూ, సర్వే అధికారులు సర్వే చేస్తున్నారు. సత్తెనపల్లి మండలం కంటెపూడి నుండి వెన్నాదేవి వరకు సుమారు 11 కిలో మీటర్ల మేర బైపాస్ రోడ్డు నిర్మాణానికి అవసర మైన భూములు సేకరించేందుకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే చేస్తున్నారు. రైతుల సమక్షంలో సర్వే నంబర్లు ఆధారంగా 45 మీటర్ల విస్తీర్ణాన్ని సర్వే చేస్తున్నారు.

భూములు సర్వే చేస్తున్న అధికారులు

మద్దతు ధర చట్టం కోసం 26న ట్రాక్టర్ల ర్యాలీ

ప్రజాశక్తి - నరసరావుపేట

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వివిధ సంఘాల నాయకులు

నష్టాల ఊబిలో కూరుకుపోతున్న వ్యవసాయ రంగాన్ని కాపాడాలంటే స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని అఖిలపక్ష రైతు, కార్మిక, ప్రజా సంఘాల సమన్వయ సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక కోటప్పకొండ రోడ్డులోని ప్రజా సంఘాల కార్యాలయంలో రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు వై.గోపాలరావు అధ్యక్షతన సమావేశం శనివారం నిర్వహించారు. పంటలకు మద్దతు ధర కోసం ఈనెల 26న పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో నిర్వహించే ట్రాక్టర్ ర్యాలీ జయప్రదం చేయాలని సమావేశం పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పజెప్పడానికి కేంద్రలోని బిజెపి ప్రభుత్వం పూనుకుందని, వ్యవసాయానికి ఇచ్చే ఉచిత విద్యుత్‌ను రైతులకు భారం చేయడానికి విద్యుత్ సవరణ బిల్లు చట్టం తెచ్చిందని చెప్పారు. ఈ విధానాలను రైతులతోపాటు ప్రజలంతా ఐక్యమై తిప్పికొట్టాలని చెప్పారు. పంటలకు మద్దతు ధరల కోసం చట్టం చేయాలని డిమాండ్ చేశారు. మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో జరిగిన ఉద్యమం సందర్భంలో అనేక మంది రైతులపై అక్రమ కేసులు పెట్టారని, వాటిని ఎత్తివేయడంతోపాటు ఉద్యమంలో చనిపోయిన రైతు కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు రుణభారం లేకుండా కేరళ తరహాలో రుణ విమోచన చట్టాన్ని అమలు చేయాలన్నారు. ఈ సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమం మరింత ఉధృతమవుతుందని స్పష్టం చేశారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు గద్దె చలమయ్య, జి.బాలకృష్ణ, జి.జనార్ధన్‌బాబు, యు.రాము, టి.ఆంజనేయులు, జి.విజయకుమార్, కె.హనుమంత్‌రెడ్డి, ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, ఇ.మస్తాన్‌రెడ్డి, షేక్ సిలార్ మసూద్, కె.రామారావు, ఎం.నరసింహారావు, వెంకటేశ్వర్లు, నరసింహారెడ్డి, పిచ్చిరెడ్డి ఫిరోజ్, భాస్కర్, ప్రసాదు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న విజ్ఞాన్ చైర్మన్, వర్సిటీ వీసీ తదితరులు

15వ తేదీ నుండి విజ్ఞాన్ మహోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ఫిబ్రవరి 15-17 తేదీల్లో 'విజ్ఞాన్ మహోత్సవ్-2023' యూత్‌ఫెస్టివల్ నిర్వహిస్తామని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషన్ తెలిపారు. ఈ మేరకు పోస్టర్లను వర్సిటీలో శనివారం ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ విజ్ఞాన్ మహోత్సవ్‌లో పాల్గొనేందుకు దేశవ్యాప్తంగా 50 వేల మంది విద్యార్థులు వచ్చే అవకాశం ఉందని, విజ్ఞాన్ మహోత్సవ్ పోటీల విజేతలకు భారీ స్థాయిలో నగదు బహుమతులను అందజేస్తామని తెలిపారు. ఈ ఏడాది యూత్ ఫెస్టివల్‌లో పారా అథ్లెటిక్స్ పోటీలను కూడా ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. మహోత్సవ్‌లో 82 ఈవెంట్లను నిర్వహించనున్నామని, వాలీబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, చెస్, అథ్లెటిక్స్, త్రోబాల్ తదితర క్రీడాంశాల్లో జాతీయస్థాయిలో విద్యార్థులకు పోటీలు ఉంటాయని చెప్పారు. వీటితోపాటు కల్చరల్స్, లిటెరరీ, ఫైన్ ఆర్ట్స్, ఫ్యాషన్, మ్యూజిక్, డాన్స్, స్పాట్‌లైట్, థియేటర్ ఆర్ట్స్ వంటి తదితర రంగాలను కలుపుకుని సాంకేతిక, సాంస్కృతికాంశాల్లో జాతీయస్థాయి పోటీలు ఉంటాయని వివరించారు. పారా అథ్లెటిక్స్ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్స్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

10న ఆర్‌విఆర్‌లో జాతీయ సాంస్కృతిక పోటీలు

ప్రజాశక్తి - గుంటూరు

దేశంలో సాంస్కృతిక ప్రతిభ కలిగిన ఇంజినీరింగ్ విద్యార్థులను పరిచయం చేసేందుకు తమ కళాశాల వేదిక కావటం ఆనందదాయకమని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. ఫిబ్రవరి 10న కొలోరిడో-2023 పేరుతో జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ ఆవిష్కరించారు. ఆధునిక యుగంలో విద్యార్థుల్లో పెరుగుతున్న ఒత్తిడిని అధిగమించి, వారిలో మానసిక ఉత్తేజాన్ని పెంచేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని కళాశాల ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ లిటరరీ, ఫైన్ ఆర్ట్స్, డ్రమటిక్, సింగింగ్, డ్యాన్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నామని, ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహయ బహుమతులు ఉంటాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు www.rvrjcce.in/colorido2k23 వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న సెక్రెటరీ, ప్రిన్సిపాల్ తదితరులు

వేగం కన్నా ప్రాణం మిన్న

ప్రజాశక్తి-గుంటూరు

కిట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం జిల్లా రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ తోట రాఘవరావు మాట్లాడుతూ యువత రహదారి భద్రత నియమాల్ని పాటించాలని చెప్పారు. ద్విచక్ర వాహనాలు నడిపే వారు హెల్మెట్ ధరించకపోవటం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్ చాలా ప్రమాదాకరమని చెప్పారు. రోడ్డు ప్రమాదాలకు గురవుతున్న వారిలో ద్విచక్ర వాహనదారులే అధికంగా ఉన్నారన్నారు. అనుకోని పరిస్థితుల్లో ప్రమాదం జరిగితే గంటలోగా క్షతగాత్రుల్ని ఆసుపత్రిలో చేర్పిస్తే ప్రాణాలు కాపాడవచ్చన్నారు. విద్యార్థులు రోడ్డు భద్రత నిబంధనల అమలలో భావి తరాలకు ఆదర్శంగా ఉండాలన్నారు. కార్యక్రమానికి కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు అధ్యక్షత వహించగా కార్యదర్శి కోయి శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రాఘవరావు

ఓటర్ల తగ్గింపు కలకలం

7 వీక్షణం

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఓటర్ల సంఖ్య తగ్గడంపై రాజకీయ పార్టీలు అధ్యయనం చేస్తున్నాయి. ప్రధాన ప్రతిపక్షం టిడిపి, జనసేన పార్టీలకు చెందిన వారి పేర్లను జాబితాల నుంచి తొలగించారని ఆ పార్టీ నాయకులు ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గాల వారీగా టిడిపి నాయకులు ఓటర్ల జాబితాలను పరిశీలిస్తున్నారు. గ్రామస్థాయిలో నాయకులను పిలిపించి పాత ఓటర్ల జాబితాలో ఉన్న పేర్లు, కొత్త జాబితాల్లో తొలగించిన పేర్లను పోల్చి చూస్తున్నారు. చనిపోయిన వారు, వలస వెళ్లిన వారు, డబల్ ఎంట్రీ ఓటర్లను మాత్రమే తొలగించామని ఎన్నికల కమిషన్ చెబుతుండగా టిడిపి, జనసేన పార్టీలకు చెందిన సానుభూతి పరుల పేర్లనుజాబితాల నుంచి తొలగించినట్టు ఆ పార్టీలు భావిస్తున్నాయి.

2019 ఎన్నికల ముందు ఉన్న ఓటర్ల కంటే ఇప్పుడు ఓటర్లు తగ్గారు. గతేడాది జనవరి నాటికి ఉన్న జాబితాల్లో ఉన్న పేర్లు ఇప్పుడు గల్లంతయ్యాయి. జిల్లా మొత్తం మీద 97,459 మంది పేర్లు ఓటర్ల జాబితాల నుంచి తొలగించారు. ఒక్కో నియోజకవర్గంలో ఐదు నుంచి 10 వేల తగ్గాయి. గతేడాది కంటే ఈ ఏడాది ఓటర్ల సంఖ్య పెరగకపోగా కొన్ని నియోజకవర్గాల్లో తగ్గడం అనుమానాలకు తావిస్తుంది.

మంగళగిరి నియోజకవర్గంలో గత నాలుగేళ్లలో జనాభా భారీగా పెరిగారు. నివాసాలు పెరిగాయి. కానీ ఓటర్ల పెరుగుదల కన్పించలేదు. మంగళగిరి నియోజకవర్గంలో గతేడాది జనవరి 5 నాటికి 2,87,415 మంది ఓటర్లు ఉండగా ఈ ఏడాది జనవరి 5 నాటికి 2,78,415 మంది ఓటర్లు ఉన్నట్టు అధికారులు విడుదల చేసిన జాబితాల్లో తెలిపారు. దాదాపు 4483 మంది ఓటర్లు తగ్గారు. తాడికొండ నియోజకవర్గంలో 5806 మంది, పొన్నూరులో 9443 మంది, గుంటూరు పశ్చిమలో అత్యధికంగా 9766 మంది ఓటర్లు తగ్గడం చర్చనీయాంశమైంది. గుంటూరు పార్లమెంటు పరిధిలో 47,446 మంది ఓటర్లు తగ్గగా ఉమ్మడి జిల్లాలో మాత్రం 97 వేల మంది తగ్గారు. మొత్తంగా మహిళా ఓటర్లు అధిక సంఖ్యలో ఉన్నారు.

రాబోయే సార్వత్రిక ఎన్నికలు ఈ ఓటర్ల జాబితాలతోనే జరుగుతాయని భావిస్తున్న నేపథ్యంలో ప్రతిపక్ష టిడిపి, జనసేనలో ఈ జాబితాలపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. స్పష్టమైన వివరాలతో పరిశీలించాలని జిల్లా, మండల కమిటీలకు టిడిపి అధిష్టానం సూచించింది. తాజాగా అందిన సమాచారం ప్రకారం గత ఏడాది కన్నా ఈ ఏడాది ఓటర్ల జాబితాల్లో మార్పులు, చేర్పులు అత్యంత గుంభనంగా సాగాయి. అధికార పార్టీ వ్యూహాత్మకంగా మార్పులు చేసినట్టు ప్రధాన రాజకీయ పార్టీలు అనుమానిస్తున్నాయి. అయితే ఆధార్ అనుసంధానంతో పాటు ఓటర్ల జాబితాల్లో ఒకే పేరుతో రెండు మూడు పేర్లు, ఫోటోలు ఉంటే వాటిని తొలగించినట్టు అధికారులు చెబుతున్నారు.

సహజంగా ఏ పార్టీ అధికారంలో ఉంటే ఈ పార్టీకి చెందిన వారిని పలు ప్రాంతాల్లో చేర్పించడం, ప్రత్యర్థి పార్టీలకు చెందిన సానుభూతిపరుల పేర్లు తొలగించడం కొనేళ్లుగా జరుగుతోంది. ఇదే రీతిలో ఎంపిక చేసిన యంత్రాంగం ద్వారా టిడిపి, జనసేన తదితర పార్టీలకు చెందిన వారి పేర్లను తొలగించినట్టు తెలుస్తోంది. ఈ అంశంపై ఏ తగిన ఆధారాలతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడానికి టిడిపి సన్నద్ధమవుతోంది.